Follow: @ANNTELUGU

05-07-2026

# మహా పత్రిక


ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 168 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




టాప్ న్యూస్

## సిద్దిపేట్ కా షేర్



- హరీష్ రావుపై విజయ్ దేవరకొండ ప్రశంసలు

02

## తగ్గేదేలే... ఈసీపై కవిత ఆగ్రహం



- కొత్త పేరు ఇచ్చేది లేదని స్పష్టం
- న్యాయపోరాటం చేస్తానని ప్రకటన
- టీఆర్ఎస్ పేరుపై ఈసీకి అభ్యంతరాలు వ్యక్తం చేసిన పలువురు

02

## మీరు నన్ను ఆపాలనుకుంటే చంపాల్సిందే



- తిరుగుబాటుదారులకు మమత సవాల్
- తన రాజకీయ ప్రస్థానాన్ని ఎవరూ అడ్డుకోలేరని వ్యాఖ్య

03

## అడుగు పెడితే చంపేస్తాం

### ప్రధాని మోదీకి బెదిరింపులు



**ఢిల్లీ, మహా :** ఆస్ట్రేలియా పర్యటనలో ప్రధాని నరేంద్రమోదీని చంపేస్తామని సోషల్ మీడియాలో బెదిరింపుల పోస్టులు ఆందోళన కలిగిస్తున్నాయి. మెల్ బోర్న్ మీట్స్ మోదీ కార్యక్రమంలో మోదీని చంపేస్తామని సోషల్ మీడియాలో బెదిరింపులు వచ్చినట్లుగా

మిగతా 3వ పేజీలో



## పదేళ్ళలో జడ్చర్లకు మెట్రో తెస్తా ఎమ్మెల్యే అనిరుథ్ రెడ్డి

**జడ్చర్ల, మహా :** రాబోయే పదేళ్లలో జడ్చర్లకు మెట్రో రైలు సేవలను తీసుకువస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. జడ్చర్లను ఒక ఐటీ, పారిశ్రామిక హబ్‌గా మార్చే విజన్‌లో భాగంగా డేటా సెంటర్లతో పాటు మెట్రో కనెక్టివిటీ కూడా తీసుకొస్తామని శనివారం జరిగిన బహిరంగసభలో ఆయన ప్రకటించారు



## టెలిగ్రామ్‌పై కేంద్రం సీరియస్

- 15 రోజుల్లోగా చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని ఆదేశం

02



## కర్ణాటకలో ఎస్ఐఆర్‌పై కేంద్రమంత్రి కుమారస్వామి ఫైర్

- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను రద్దు చేయాలని డిమాండ్
- ప్రక్రియలో తీవ్ర లోపాలున్నాయని ఆరోపణ
- సోమవారం ఈసీని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడి

02

## మెట్రో ప్రయాణికులకు పెరగనున్న నిరీక్షణ సమయం

- కొత్త కోచ్‌ల కొనుగోలు ప్రక్రియలో రెండేళ్ల జాప్యం
- కేంద్రం నుంచి రాష్ట్రానికి బదిలీ ప్రక్రియ ఆలస్యం కావడమే కారణం

02





# ఫామ్ హౌస్‌లోనే కుంగి కృశించి పోవాలి

### మిడ్జిల్ సభలో కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

ప్రజాపాలన పోయి పాపాలభైరవుడు రావాలా?


మిడ్జిల్ నాటిన మొక్క... నేడు మహా వృక్షమైంది

మిడ్జిల్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దత్తత తీసుకుంటారు

**జడ్చర్ల, మహా :** బీఆర్ఎస్ కు మళ్లీ అధికారం అనేది కల మాత్రమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అరుంధతి సినిమాలో పశుపతిని గొలుసులతో బంధించినట్లు కేసీఆర్‌ను ఫాంహౌస్‌లో ఈ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు గొలుసులతో బంధించారని ఇక ఆయన అక్కడే కుంగి కృశించి పోవాలి తప్ప అధికారం అనేది గతం అన్నారు. ప్రతిపక్ష నాయకుడి పదవి వస్తే ప్రజా సమస్యలపై మాట్లాడరట కానీ అధికారం ఇస్తే దోచుకునేందుకు మాత్రం బయటకు వస్తారట అని ఎద్దేవా చేశారు. తన రాజకీయ ప్రస్థానం 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా నాగర్ కర్నూల్

మిగతా 3వ పేజీలో





జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు

## పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు

### మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ జరగనున్న భేటీ

- మహిళా రిజర్వేషన్, ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లులు అజెండాలో ఉండే అవకాశం
- శివసేన, తృణమూల్ రెబల్ ఎంపీల విలీనంతో ఎన్డీయే బలం పెరిగే ఛాన్స్
- తీవ్ర నేరాల్లో జైలుకెళ్తే పదవులు రద్దు చేసే బిల్లును ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

**న్యూఢిల్లీ, మహా :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జులై 20వ తేదీ నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి ఆమోదం తెలిపారని

మిగతా 2వ పేజీలో

## పాక్, శ్రీలంకల్లలాగా తెలంగాణ దివాలా ఖాయం

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ ఫైర్
- రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై రుద్దారని మండిపాటు
- రాష్ట్రం అభివృద్ధిపథంలో సాగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని వ్యాఖ్య

02



## పోలీస్ శాఖలో భారీ కొలువులు జాతర

ఐదు వేల ఉద్యోగాల భర్తీకి ఆర్థిక శాఖ క్లియరెన్స్

- మరో రెండు వేల ఉద్యోగాలకు అనుమతి కోరిన పోలీసు శాఖ
- ససేమిరా అన్న ఆర్థిక శాఖ
- మంజూరైన అయిదు వేల ఉద్యోగాలకు త్వరలోనే నోటిఫికేషన్ జారీ
- విధి విధానాలను ఖరారు చేస్తున్న పోలీసు నియామక బోర్డు


02




## దక్షిణ భారతదేశ ఇంధన భద్రతలో సింగరేణి కీలక పాత్ర పోషించాలి

- సంస్థ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం
- హైదరాబాద్ సింగరేణి భవన్ లో సింగరేణిపై ప్రత్యేక సమీక్షలో కేంద్ర బొగ్గు,
- గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి

02





తగ్గేదేలే...

# ఈసీపై కవిత ఆగ్రహం



**హైదరాబాద్, మహా :** జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత ఏర్పాటు చేసిన తెలంగాణ రక్షణ సేన పార్టీ మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. వివిధ వర్గాల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకున్న ఎన్నికల సంఘం టీఆర్ఎస్ పార్టీ పెట్టుకునేందుకు అంగీకరించడం లేదు. కచ్చితంగా పేరు మార్చాల్సిందేనంటూ కవితకు లేఖ రాశారు. పదిహేను రోజుల్లో మూడు ప్రత్యామ్నాయాలు ఇవ్వాల్సిందేనంటూ స్పష్టం చేశారు. లేకుంటే రిజిస్ట్రేషన్ చేసుకున్న పార్టీ ఆటోమేటిక్‌గా ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే రద్దు చేస్తామని తేల్చేశారు. దీనిపై కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను న్యాయపోరాటం చేస్తానంటూ ప్రకటించారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎత్తి చూపిన రెండు అభ్యంతరాలకు సమాధానం ఇచ్చామని కవిత ప్రకటించారు. ఎన్నికల సంఘం ఒత్తిడి చేస్తున్నట్టు ప్రత్యామ్నాయాలు ఇవ్వోమని వెల్లడించారు. తన పార్టీ పేరు విషయంలో కచ్చితంగా న్యాయపోరాటం చేస్తామన్నారు. కవిత ప్రకటనతో ఈ వివాదంలో మరో మలుపు తిరిగింది. ఇప్పటికే తన పార్టీ విషయంలో ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేసి విజయం సాధించిన కవిత, ఇప్పుడు మరోసారి కోర్టు మెట్లు ఎక్కేందుకు సిద్ధమవుతున్నారు.

**మొదటి నుంచి అభ్యంతరాలు**

కవిత పార్టీ ఏర్పాటు మొదటి రోజు నుంచి కూడా వివాదాల చుట్టే తిరుగుతోంది. ఏప్రిల్ 25న కవిత తన పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రకటించారు. దీనికి అసోసియేషన్ పేర్కొనడంతోనే ప్రత్యర్థులు అనేక రకాలుగా విమర్శలు చేశారు. టీఆర్ఎస్‌గా పేర్కొన్న ఈ పార్టీకి ఈసీలో గుర్తింపు రాలేదు. తెలంగాణ రక్షణ సేనగా మార్చుకుంటే గుర్తింపు లభిస్తుందన్న సలహా మేరకు రోజుల వ్యవధిలోనే తెలంగాణ రాష్ట్ర సేన కాస్త తెలంగాణ రక్షణ సేనగా మారింది. అయినా దీని సంక్షిప్త రూపం టీఆర్ఎస్ ఉన్నందున ఆమె నుంచి అప్పట్లో పెద్దగా అభ్యంతరాలు రాలేదు.

**పార్టీ ఏర్పాటు నుంచి సమస్యలే**

తెలంగాణ ప్రజా జాగృతి, తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జాగృతి, తెలంగాణ ప్రజా శక్తి పేర్లను కూడా గతంలో కవిత పరిశీలించారు. అయితే ప్రజల్లోకి బాగా వెళ్లిన టీఆర్ఎస్ పేరుకి కలిసి వచ్చేలా తెలంగాణ రక్షణ సేనను ఫైనల్ చేసుకున్నారు. అయితే ఇప్పుడు దాన్ని పూర్తి స్థాయి రాజకీయ పార్టీగా రిజిస్టర్ చేయడానికి ఈసీ నుంచి అభ్యంతరం వ్యక్తమవుతోంది. ఇలా పార్టీలు రిజిస్ట్రేషన్ చేసే ముందు దరఖాస్తుదారు తరఫున పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా ఎవరైనా అభ్యంతరాలు చెబితే ఎన్నికల సంఘం పరిశీలించి పార్టీ ఏర్పాటు చేయబోయే వారి నుంచి క్లారిఫికేషన్ అడుగుతుంది. అయితే మొదటి నుంచి వివాదంగా మారిన టీఆర్ఎస్ కలిసి వచ్చేలా ఏర్పాటు చేసిన పార్టీలపైనే అభ్యంతరాలు వస్తున్నాయి. అందుకే మరో మూడు ప్రత్యామ్నాయాలు చెప్పాలని ఈసీ సూచించింది. ఇప్పటికే తండ్రిని ఎదురించి పార్టీ పెడుతున్న కవిత వైపు నిలబడేందుకు పెద్ద నేతలు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పుడు తెలంగాణ ప్రజలకు బాగా పరిచయం అయిన టీఆర్ఎస్ పార్టీగా ప్రజల్లోకి వెళ్దామనే ప్లాన్‌కి ఈసీ చెక్ పెట్టేలా ఉంది. దీంతో ఆమె అనుచరుల్లో ఆందోళన మొదలైంది. ఆమె మాత్రం న్యాయపోరాటం చేస్తామని, విజయం సాధిస్తామని ధీమాతో ఉన్నారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలి

- **బీఆర్ఎస్ నేత దేవి ప్రసాద్**



**హైదరాబాద్, మహా :** ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బేవరేజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినట్లు ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నెలల తరబడి జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఏడు నెలలు, నిలోఫర్ ఆసుపత్రిలో తొమ్మిది నెలలు, పంచాయతీరాజ్ శాఖలో మూడు నెలలు, వరంగల్ ఈఎస్ఐ డిస్పెన్సరీలో నాలుగు నెలలుగా జీతాలు బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రౌండ్ వాటర్, మున్సిపాలిటీలు, ప్రభుత్వ ఆసుపత్రులు, పోలీస్ శాఖలు తదితర విభాగాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నట్లు తెలిపారు. ఉద్యోగుల జీతాల నుంచి ఈఎస్ఐ, ఈపీఎఫ్ నిధులను మినహాయించినప్పటికీ సంబంధిత ఖాతాల్లో జమ చేయకుండా కొంతమంది ఏజెన్సీలు వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని జీతాలను తక్షణమే విడుదల చేయాలని, ముఖ్యమంత్రి ఆదేశాలను అమలు చేయని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈఎస్ఐ-ఈపీఎఫ్ చెల్లింపులు చేయని ఏజెన్సీలను బ్లాక్‌లిస్ట్ చేయాలని, ప్రభుత్వమే నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమ చేసే విధానాన్ని అమలు చేయాలని, అన్ని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై ప్రత్యేక విచారణ చేపట్టాలని దేవీప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు.

# కర్ణాటకలోఎస్ఐఆర్‌పై కేంద్రమంత్రి కుమారస్వామి ఫైర్

**రద్దుచేయాలంటూ డిమాండ్**



**బెంగళూరు, మహా :** కర్ణాటకలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అర్థరహితమని, దీనిని తక్షణమే రద్దు చేయాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డీ. కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఆరోపిస్తూ శనివారం ఆయన బెంగళూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ఇప్పటివరకు జరిగిన ఈ సవరణ ప్రక్రియకు ఎటువంటి ప్రాతిపదిక లేదు. దీనిని పూర్తిగా రద్దు చేయాలన్నదే మా ప్రధాన డిమాండ్" అని కుమారస్వామి స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ఎన్నికల అధికారులు ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నివేదిక సమర్పించారని, వారి ఆదేశాల కోసం నిరీక్షిస్తున్నామని తెలిపారు. ఓటర్ల జాబితాలో జరుగుతున్న అక్రమాలపై పూర్తి వివరాలతో సోమవారం ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలుస్తానని, ప్రస్తుత ప్రక్రియను నిలిపివేసి పారదర్శకంగా పునఃసవరణ చేపట్టాలని కోరనున్నట్లు వెల్లడించారు. ఈ విషయంలో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం, కేపీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్, హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే మౌనం వహించడంపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు.

# డ్రగ్స్ రహిత రాష్ట్రం తెలంగాణ లక్ష్యం విద్యార్థులు, యువతతోనే అదిసాధ్యం

**ఇండియన్ సదస్సులో ఈగల్ ఫోర్స్ అడిషనల్ ఎస్పీ కృష్ణమూర్తి**

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, యువతను చైతన్యవంతుల్ని చేస్తూ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దే దిశగా విశేషంగా కృషి చేస్తుందని ఈగల్ ఫోర్స్ అడిషనల్ ఎస్పీ పి.కృష్ణమూర్తి తెలిపారు శనివారం యూసఫ్ గూడా లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజర్స్ లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో యంగ్ ఇండియన్స్ నిర్వహించిన యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ 2026 సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత డ్రగ్ ఫ్రీ కోసం ప్రమాణం చేయించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నివారణకు చేపడుతున్న చర్యలను, తీసుకుంటున్న కఠిన నిర్ణయాలను విద్యార్థులకు వివరించారు. యంగ్ ఇండియన్స్, హైదరాబాద్ చాప్టర్ చేస్తున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు.

# జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు

**( మొదటి పేజీ తరువాయి )**



రిజిజు వివరించారు. మొత్తం నాలుగు వారాల పాటు జరిగే ఈ సెషన్‌లో 19 రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి.

ఈసారి వర్షాకాల సమావేశాలు మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో వాడీవేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్ష కూటమిలో నెలకొన్న విభేదాలు, అధికార ఎన్డీయే బలాన్ని పెంచే పరిణామాలు ఈ సెషన్‌పై ప్రభావం చూపనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్ ఎంపీలు ఎన్‌సీపీఐలో విలీనం కావడం, ఉద్ధవ్ థాకరే వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడం వంటి అంశాలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలతో పార్లమెంటులో ఎన్డీయే బలం మరింత పెరగనుండగా, విపక్ష 'ఇండియా' కూటమి బలహీనపడనుందని అంచనాలు వెలువడుతున్నాయి. మరోవైపు తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ టీవీకేతో పొత్తు పెట్టుకోవడంతో డీఎంకే తీవ్ర అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో తమ ఎంపీలకు కాంగ్రెస్ సభ్యులతో సంబంధం లేకుండా ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరుతూ డీఎంకే ఇప్పటికే స్పీకర్‌కు లేఖ రాసింది. ఈ పరిణామాలన్నీ సభలో ప్రతిపక్షాల ఐక్యతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.

**ప్రభుత్వ అజెండాలో కీలక బిల్లులు**

ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత సమావేశాల్లో తిరస్కరణకు గురైన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఈసారి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు వరుసగా 30 రోజులకు మించి జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారి పదవులు వాటంతట అవే రద్దయ్యేలా నిబంధనలు తీసుకొచ్చే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన 'ఒకే దేశం ఒకే ఎన్నిక' బిల్లు కూడా కేంద్రం అజెండాలో ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, యాంటీడోపింగ్ బిల్లులను కూడా సభ ముందుకు తీసుకురావడానికి రంగం సిద్ధమైంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లుతో పాటు వేతన నియమావళి, కార్పొరేట్ లా, సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్‌లకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు చట్ట సభల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణానికి దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



## టెలిగ్రామ్‌పై కేంద్రం సీరియస్

**15 రోజుల్లోగా చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని ఆదేశం**

**ఢిల్లీ, మహా :** డిజిటల్ వేదికలపై యథేచ్ఛగా సాగుతున్న పైరసీ కంటెంట్ వ్యవహారంలో ప్రముఖ అంతర్జాతీయ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌కు కేంద్ర ప్రభుత్వం అత్యంత తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. తమ ప్లాట్‌ఫామ్ వేదికగా చట్టవిరుద్ధంగా చలామణి అవుతున్న పైరేటెడ్ సినిమాలు, ఓటీటీ కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. ఈ చట్టవిరుద్ధ కంటెంట్‌పై తీసుకున్న కఠిన చర్యలకు సంబంధించి రాబోయే 15 రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ టెలిగ్రామ్ యాజమాన్యానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. భారత్‌లో ప్రస్తుతం వేగంగా విస్తరిస్తున్న క్రియేటర్ ఎకానమీతో పాటు చిత్ర పరిశ్రమ, బ్రాడ్‌కాస్టర్లు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, నిర్మాతలు, పంపిణీదారులను డిజిటల్ పైరసీ బారి నుంచి కాపాడే ప్రధాన లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు విడుదలైన కొద్ది గంటల్లోనే వివిధ టెలిగ్రామ్ ఛానెళ్ల ద్వారా ఉచితంగా లీక్ అవుతూ పైరసీకి గురవుతుండటంతో చిత్ర పరిశ్రమ వర్గాలు ప్రతిఏటా కోట్లాది రూపాయల మేర తీవ్రంగా నష్టపోతున్నాయి. ఈ తీవ్ర నష్టాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఇప్పుడు గట్టిగా రంగంలోకి దిగింది.

# పోలీస్ శాఖలో భారీ కొలువులు జాతర



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో పోలీసు కొలువుల కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది అభ్యర్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. హోంశాఖ పరిధిలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పరిపాలనా నియంత్రణలో ఉన్న వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఐదు వేల పోస్టులను భర్తీ చేసేందుకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఆర్థిక శాఖ గత నెల 27 జీవో నెంబర్ 78 జారీ చేసింది. రాష్ట్రంలో శాంతి భద్రతలను మరింత మెరుగుపరచడానికి, పోలీస్ శాఖలో పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సమర్పించిన ప్రతిపాదనలను ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించింది. శాఖలోని కార్యకరాలాపాలు, అవసరాలు, ఆర్థిక సంబంధిత అంశాలను పరిగణలోకి తీసుకొని, నేరుగా నియామక ప్రక్రియ ద్వారా ఈ ఐదు వేల పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు.

ఐదు వేల పోస్టుల్లో సివిల్ పోలీస్ విభాగం నుంచి టెక్నికల్ విభాగం వరకు వివిధ రకాల ఉద్యోగాలు ఉన్నాయి. సబ్ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్(సివిల్) 148 పోస్టులు, సబ్ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్(ఏఆర్) 14, రిజర్వ్ సబ్ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్(టీజీఎస్పీ) 12, సబ్ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్(ఎస్ఏఆర్ సీపీఎల్)3, అసిస్టెంట్ సబ్ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎఫ్‌పీబీ)23, పోలీస్ కానిస్టేబుల్(సివిల్) 3,697, పోలీస్ కానిస్టేబుల్(AR)1,052,
కానిస్టేబుల్(ఎస్ఏఆర్ సీపీఎల్)24, కానిస్టేబుల్(డ్రైవర్) పీటీవో 20, కానిస్టేబుల్ (మెకానిక్) పీటీవో 7 పోస్టులున్నాయి. ఖరారు చేసిన పోస్టులకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ, నియమ నిబంధనలు తదితరాలన్నింటికి సంబంధించి పోలీసు నియామక బోర్డు త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనుంది.

**మరో రెండు వేల పోస్టులపై సందిగ్ధం**

ఇదిలా ఉండగా, పోలీసు శాఖలో దాదాపు 19 వేల ఉద్యోగాలు వివిధ స్థాయిలలో ఖాళీగా ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం మంజూరు చేసిన ఐదు వేల పోస్టులకు తోడుగా మరో రెండు వేల పోస్టుల నియామకాల కోసం అనుమతించాలంటూ ఇటీవల పోలీసు శాఖ ఆర్థిక శాఖను కోరుతూ లేఖ రాసింది. అయితే ఈ తాజా ప్రతిపాదనను ఆర్థిక శాఖ పెండింగ్ లో పెట్టింది. రిక్రూట్ మెంట్ ప్రక్రియను ప్రారంభించేందుకు వివిధ స్థాయిలలో శాఖాపరంగా కొన్ని తాత్కాలిక ఏర్పాట్లను చేయాల్సి ఉన్నందున ఏఖ మొత్తంలో నియామకాలను చేపడితే బాగుంటుందన్న ఉద్దేశ్యంతో అధికారులు రెండు వేల పోస్టులకు కూడా అనుమతించాలని ఆర్థిక శాఖను కోరుతున్నారు. లేకపోతే ఒక సారి నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత తిరిగి నోటిఫికేషన్ జారీ చేయడం, రిక్రూట్ మెంట్ ప్రక్రియను ప్రారంభించడం అనేది ఖర్చుతో పాటు శ్రమతో కూడుకున్నదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**ఆగని నిరుద్యోగుల ఆందోళనలు**

మరోవైపు పోలీసు శాఖలో ఉన్న ఖాళీలు దాదాపు 20 వేల వరకు ఉంటాయని, వాటన్నింటినీ భర్తీ చేయాల్సిందేనంటూ గత కొన్నాళ్ళుగా పోలీసు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తు శిక్షణ తీసుకుంటున్న నిరుద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా ఆందోళనలను కూడా చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఇదే డిమాండ్ తో డీజీపీ కార్యాలయాన్ని ముట్టిడించేందుకు ప్రయత్నించడంతో ఉద్రితక్త వాతావరణం ఏర్పడింది. పోలీసు శాఖలో ప్రతినెలా దాదాపు 500 మంది రిటైర్ అవుతున్నారని, ప్రస్తుతం మంజూరైన పోస్టుల భర్తీ అయ్యే నాటికి అంటే ఎంపికైన అభ్యర్థులు శిక్షణ పొంది విధుల్లో చేరే సరికి దాదాపు 18 మాసాలవుతుందని, అప్పటి వరకు మరో తొమ్మిది వేల మంది పోలీసు శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు పదవీ విరమణ పొందే అవకాశాలున్నాయి. ఖాళీలను నిరంతరం భర్తీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు వెనుకంజ వేయడం పట్ల నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# దక్షిణ భారతదేశ ఇంధన భద్రతలో సింగరేణి కీలక పాత్ర పోషించాలి

హైదరాబాద్, మహా : దక్షిణ భారతదేశంలో ఏకైక ప్రధాన బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ రానున్న రోజుల్లో తన సేవలను మరింత విస్తృత పరచాలని, కొత్త గనులు సాధించి పెరుగుతున్న దేశ ఇంధన అవసరాలకు తోడ్పాటును అందించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. శనివారం ఇక్కడి సింగరేణి భవన్ లో సింగరేణి సంస్థ పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన సింగరేణి గనుల ఉత్పత్తి, రవాణా, ఓవర్ బారదేన తొలగింపునకు సంబంధించిన వివరాలను కొత్త గనులు వాటి ఉత్పత్తి వివరాలు, అనుమతుల స్థితిగతులపై గనుల వారీగా కూలంకశంగా సమీక్షించారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి పెంచడం కోసం అవసరమైన కొత్త బ్లాక్ లను బొగ్గు శాఖ నిర్వహించే వేలం పాటలో పాల్గొని సాధించాలని సూచించారు. దేశంలో విద్యుత్ అవసరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో రానున్న 10, 15 సంవత్సరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. దేశ ఇంధన రంగంలో ఇంకా సుదీర్ఘ కాలం బొగ్గు కీలక పాత్ర పోషించనున్నదని కనుక బొగ్గు ఉత్పత్తిని గణనీయంగా పెంచడంపై దృష్టి సారించాలని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ, పని సామర్థ్యాన్ని మరింతగా పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు. సంస్థ వాణిజ్యపరమైన విజయాలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

నేటి పోటీ మార్కెట్ లో ప్రభుత్వ సంస్థలు నిలబడాలంటే నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవడంతోపాటు ప్రతీ ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కనుక కార్మికులకు సంస్థ స్థితిగతులపైన సరైన అవగాహన కలిగించడానికి కృషి చేయాలన్నారు. కంపెనీ అభివృద్ధికి, సంస్కరణల అమలుకు ఒక ప్రత్యేక కమిటీని నియమించుకోవాలన్నారు. సమష్టిగా సింగరేణి అభివృద్ధిలో పాలుపంచుకోవాలని. సంస్థ అభివృద్ధికి తాము పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**బొగ్గు గ్యాసిఫికేషన్ పై దృష్టి సారించాలి**

దేశంలో కోల్ గ్యాసిఫికేషన్ కు విస్తృత అవకాశాలు ఉన్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దక్షిణ భారత దేశంలో ఉన్న ఏకైన ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థగా ప్రారంభ దశలో చిన్న స్థాయిలో అయినా కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టు చేపట్టడంపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఫెర్టిలైజర్స్ తదితర పరిశ్రమలను దృష్టిలో ఉంచుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటానికి కోల్ గ్యాసిఫికేషన్ కు పూనుకోవాలన్నారు. ఎల్నినో ప్రభావానికి ముందస్తు ప్రణాళిక అవసరం

ప్రపంచ వ్యాప్తంగా మరియు భారత దేశంలో ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో వ్యవసాయ, ఇతర పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వినియోగం తీవ్రంగా పెరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ ఉత్పాదనకు తగినంత బొగ్గు అందించడానికి కోలిండియా తోపాటు సింగరేణి కూడా సంసిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ అవసరాలు పెరగనున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను ముందుగానే బలోపేతం చేసి విద్యుత్ ఉత్పత్తికి నిరంతర ఇంధన సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి పెంపుకు అనుగుణంగా రవాణా వ్యవస్థను కూడా బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు. రవాణా కాంట్రాక్టులను అత్యంత వేగంగా ఖరారు చేసి అమలు చేయడం ద్వారా అదనపు ఉత్పత్తి సకాలంలో వినియోగదారులకు చేరేలా చూడాలని సూచించారు.

**ఉద్యోగులే సంస్థ బలం**

సింగరేణి అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. సంస్థ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికల్లో ఉద్యోగులను భాగస్వాములుగా చేసుకుని వారి విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. ప్రతీ ఉద్యోగి సంస్థ విజయాన్ని తన విజయంగా భావించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సమావేశానికి ఆహ్వానం పలుకుతూ సింగరేణి లో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ప్రస్తుత సవాళ్లను వివరించారు. కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడంలో ఎదురవుతున్న పలు సవాళ్లను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా సింగరేణికి సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్ప్రైజెస్ స్టేటస్ తొలగించడం వల్ల అటవీ భూ సేకరణ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ అంశంపై అతి త్వరలోనే సానుకూల నిర్ణయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు గనిలో ఉత్పత్తి అవుతున్న బొగ్గు రవాణా విషయంలో ఉన్న సమస్యలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడతామని ఆయన హామీ ఇచ్చారు.

## ట్రిపుల్ ఐటీలో విషాదం

- **ఆరో అంతస్తు నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య**
- **మృతుడు మహబూబాబాద్ జిల్లాకు చెందిన అభిరూప్‌గా గుర్తింపు**
- **కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**హైదరాబాద్, మహా :** గచ్చిబౌలిలోని ప్రతిష్ఠాత్మక ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విషాదం చోటుచేసుకుంది. శనివారం ఓ భవనం ఆరో అంతస్తు నుంచి దూకి 20 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడిని మహబూబాబాద్ జిల్లాకు చెందిన అభిరూప్‌గా పోలీసులు గుర్తించారు. శనివారం క్యాంపస్‌లోని ఓ భవనంపై నుంచి కిందకు దూకడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న క్యాంపస్ అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రానికి చెందిన అభిరూప్ ట్రిపుల్ ఐటీలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతను గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. ఒకవైపు చదువు ఒత్తిడి, మరోవైపు అనారోగ్య సమస్యలు తోడవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆరో అంతస్తు నుంచి దూకడంతో తీవ్ర గాయాలపాలై అభిరూప్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## పాక్, శ్రీలంకల్లలాగా తెలంగాణ దివాలా ఖాయం

**సిరిసిల్ల, మహా :** తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో శనివారం పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తూ ఏకంగా రూ.10 లక్షల కోట్ల మేర అప్పుల భారాన్ని సామాన్యుడి నెత్తిన రుద్దారని దుయ్యబట్టారు. ఈ తరహా బాధ్యతారాహిత్యమైన ధోరణి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో మన రాష్ట్రం కూడా పాకిస్థాన్, శ్రీలంకల మాదిరి దివాలా తీసే దుస్థితికి చేరుకుంటుందని హెచ్చరించారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కి ప్రగతిపథంలో పయనించాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రతి చిన్న అభివృద్ధి వెనుక మోదీ సర్కార్ పంపిన నిధులే ఉన్నాయని గుర్తుచేశారు.

పల్లెల ప్రగతి కోసం ఢిల్లీ నుంచి నేరుగా వస్తున్న ఆర్థిక సంఘం నిధులను సైతం ఇక్కడి పాలకులు జీతాల చెల్లింపుల కోసం దారిమళ్లిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలపై కోర్టులకెళ్లడం ఏంటని ప్రశ్నించిన ఆయన వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించి శాశ్వత సంపదను సృష్టిస్తుంటే దానిపై కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీకి దక్కుతున్న ఆదరణను తట్టుకోలేకనే ప్రతిపక్షాలు ఈర్ష్యతో ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నాయని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారన్నారు

## సిద్ధిపేట్ కా షేర్

**హరీష్ రావుపై విజయ్ దేవరకొండ ప్రశంసలు**

**సిద్ధిపేట, మహా :** సిద్ధిపేట జిల్లా కొండపాక మండలంలోని శ్రీ సత్యసాయి సంజీవని శిశు హృదయాలయ ఆసుపత్రిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ముఖ్య నేత తన్నీరు హరీశ్ రావుతో కలిసి ప్రముఖ టాలీవుడ్ నటుడు రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ సందర్శించారు. ఈ ఆసుపత్రిలో ఇప్పటివరకు 500 మంది చిన్నారులకు విజయవంతంగా ఉచిత గుండె ఆపరేషన్లు పూర్తయిన సందర్భంగా మేనేజ్మెంట్ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సంబరాల్లో హరీశ్ రావు, విజయ్ దేవరకొండలు ముఖ్య అతిథులుగా పాల్గొని చిన్నారులతో కాసేపు సరదాగా గడిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నటుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. హరీశ్ రావుపై ప్రశంసల జల్లు కురిపించారు. హరీశ్ రావును ఉద్దేశించి ఆయన 'సిద్ధిపేట్ కా షేర్' అంటూ సంబోధించడంతో అక్కడున్న వారంతా హర్షధ్వానాలు చేశారు. పేద చిన్నారుల గుండె ఆపరేషన్ల కోసం ఈ ఆసుపత్రి అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని, వీరికి హరీశ్ రావు అందిస్తున్న మద్దతు గొప్పదని కొనియాడారు. 500 మంది చిన్నారులకు పునర్జన్మ

# నన్ను ఆపాలంటే ప్రాణాలు తీయాల్సిందే!

**తిరుగుబాటుదారులపై పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ ఫైర్.**



**కోల్‌కతా,మహా:** రాజకీయంగా తనను అడ్డుకోవడం ఎవరి వల్లా సాధ్యం కాదని, తన ప్రస్థానాన్ని ఆపాలంటే తన ప్రాణాలు తీయాల్సిందేనని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కష్టకాలంలో పార్టీని వీడి వెళ్తున్న తిరుగుబాటు నాయకులను ఆమె నమ్మకద్రోహులుగా అభివర్ణించారు. పార్టీ అధికారిక గుర్తు ఎక్కడికీ పోదని, అది తన వెంటే ఉన్న నిజమైన నమ్మకస్థుల వద్దే పదిలంగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆమె రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.పార్టీ సీనియర్ నేత చంద్రిమా భట్టాచార్య రాజీనామా వ్యవహారంపై మమత ఈ సందర్భంగా స్పష్టతనిచ్చారు. చంద్రిమా భట్టాచార్య శనివారం తన పదవికి రాజీనామా చేశారని, అయితే ఈ పరిణామంపై ఆమె ముందుగానే తనకు సమాచారం ఇచ్చారని తెలిపారు. చంద్రిమా కుమారుడు యాంటీతృణమూల్ వర్గంలో చేరడమే ఈ రాజీనామాకు ప్రధాన కారణమని ఆమె వెల్లడించారు. అలా వెళ్లడం ఆమె వ్యక్తిగత ఇష్టమని, ఆ స్వేచ్ఛ ఆమెకు పూర్తిగా ఉందని పేర్కొన్నారు. కానీ, తాను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ తిరుగుబాటుదారులతో చేతులు కలిపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఎలాంటి రాజకీయ బెదిరింపులకు తన పార్టీ ఎన్నటికీ లొంగదని, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ముందు తాను తలవంచేది లేదని దీదీ ఉద్ఘాటించారు. మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం శుక్రవారం కోల్‌కతాలోని పార్టీ ప్రధాన కార్యాలయాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకోవడంపై మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న పార్టీ ఆఫీసు వద్దకు వెళ్లి, దానికి తాళం వేసిన వారికి తానొక్కటే స్పష్టం చేస్తున్నానని ఆమె తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఆ కార్యాలయాన్ని తాము అద్దెకు తీసుకున్నామని, 2027 అక్టోబర్ నెల వరకు అది తమకే లీజుకు ఇవ్వబడిందని గుర్తు చేశారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రాణప్రదంగా భావించే 'తల్లి, మట్టి, మనుషుల' (మా, మాటీ, మానుష్) ఆస్తిని ఎవరూ అంత సులభంగా, బలవంతంగా లాక్కోలేరని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

# ఫామ్ హౌస్‌లోనే కుంగి కృశించి పోవాలి

( మొదటి పేజీ తరువాయి )

జిల్లా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో సీఎం పాల్గొని మాట్లాడారు. తనకు అనుభవం లేదని చాలా మంది నన్ను అవహేళన చేశారని సీఎం మండిపడ్డారు. దొరలకు సమస్యలపై అవగాహన ఉండకపోవచ్చు కానీ పేదల మధ్య పెరిగిన నాకు సమస్యలు తెలియదా? తట్టపనికి, మట్టిపనికి మనమే బిడ్డలు కావాలి కానీ పరిపాలనకు పాలమూరు బిడ్డ పనికిరారా? ఇలాంటి దురహంకారాన్ని బొంద పెట్టాల్సిన బాధ్యత ఇక్కడి ప్రజలపై ఉందన్నారు. అహంకారానికి కూడా ఓ హద్దు ఉంటుందన్నారు. అహంకారం, అహంభావం పేట్రేగిపోయి గద్దరన్నను గడీల ముందు నాలుగు గంటలు ఎర్రటి ఎండలో కుర్చోబెట్టిన వ్యక్తిని మనం క్షమించాలా? గద్దర్‌ను ఎండలో నిలబెట్టినా కేసీఆర్‌ను ఉరేసినా తప్పులేదన్నారు.



**ప్రజాపాలన ఎందుకు పోవాలి:**

ప్రజాపాలన పోవాలని, పాపాల భైరవుడు మళ్లీ రావాలని కేసీఆర్ కొడుకు కేటీఆర్, ఆయన అల్లుడు హరీశ్ రావు గద్దల్లా ఉర్లమీద పడి అంటున్నారని సీఎం మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో తప్పులను, అబద్ధాలను ప్రజలు క్షమించారు. కానీ రాష్ట్రం వచ్చాక పదేళ్లలో చేసిందేంటి? ఇసుక దోపిడీకి అడ్డువచ్చిన నేరెళ్ల దళితులను లారీలతో తొక్కించారు. పంటలకు గిట్టుబాటు ధర అడిగితే ఖమ్మంలో రైతులకు బేడీలు వేశారు. ప్రశ్నాపత్రాలను పల్లీబఠాణీల్లా అమ్ముకున్నారు. రేషన్ కార్డులు ఇచ్చినందుకు, సన్న బియ్యం ఇచ్చినందుకా? ఉచిత కరెంట్, మహిళలకు ఇచిత బస్సు ప్రయాణం కల్పించినందుకా ఎందుకు ప్రజా పాలన పోవాలని నిలదీశారు. ప్రజాపాలన ఎందుకు పోవాలో ఎక్కడికక్కడ చర్చ పెట్టాలన్నారు.

**ఆ నాడు ఆశీర్వదించారు**

2006 జులై 4న మిడ్జిల్ మండల ప్రజలు జడ్పీటీసీగా తనను ఆశీర్వదించారని ఆనాడు మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క ఇవాళ పెద్ద వృక్షమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో కీలకమైన మిడ్జిల్ ప్రజలకు రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీగా సువర్ణాక్షరాలతో ఒక చరిత్రను లిఖించిన రోజు 2006 జులై 4 అని గుర్తుచేశారు. ఆరోజు అది నా గెలుపు కాదని.. అది మిడ్జిల్ ప్రజల గెలుపు అన్నారు. జడ్పీటీసీగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను మిడ్జిల్ ప్రజలు అక్కున చేర్చుకున్నారని నాది ఈ నియోజకవర్గం కాకపోయినా ఇక్కడి ప్రజలు నమ్మకంతో గెలిపించారన్నారు. ఆనాడు మీరు తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదన్నారు. ఉరుములు ఉరిమినా, పిడుగులు పడ్డా నన్ను కలిసేందుకు వచ్చారు. ఉరుములు ఉరిమినా, పిడుగులు పడ్డా నన్ను కలిసేందుకు వచ్చారన్నారు.

**మిడ్జిల్‌ను భట్టి దద్దత తీసుకోవాలి..**

తనను అక్కున చేర్చుకున్న మిడ్జిల్ మండలం రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన మండలంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత నాపై ఉందన్నారు. అందువల్లే ఈ మండలాన్ని దద్దత తీసుకుని అభివృద్ధి సక్షేమ పనులను సమన్వయం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆదేశించారు. ఇది డార్క్ మండలం కాదని ఈ ప్రాంత ప్రజలకు వెలుగు రేఖలు వచ్చాయని ప్రభుత్వ లెక్కల్లో తేలాలని సూచన చేశారు. తన 20 ఏళ్ల ప్రజాజీవితంలో ఏ ఒక్కరోజు సెలవు తీసుకోలేదని ప్రతిపక్షంలో ఉంటే ప్రజాసమస్యలపై పోరాటం చేశాను. అధికారంలో సంక్షేమం, అభివృద్ధిపై దృష్టిసారించానన్నారు. అలాగే దీర్ఘకాలికంగా పట్టి పీడిస్తున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించానన్నారు. 40 ఏళ్ల వర్గీకరణ అనే రావణకాష్టాన్ని తనకు అవకాశం వచ్చిన వెంటనే పరిష్కారం చూపించానన్నారు. అలాగే 100 ఏళ్ల బీసీ సమస్యకు జనగణనతో పరిష్కారం చూపించానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,. మంత్రులు జూపల్లి క్రిష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, ఎమ్మెల్యేలు అనిరుధ్ రెడ్డి, నవీన్ యాదవ్, వంశీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.









# మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

- డి.ఎల్.ఎస్.ఏ. ద్వారా జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం
- మంచిర్యాల జిల్లా సీనియర్ సివిల్ జడ్జి నిర్మల

**మందమర్రి, మహా** : మహిళలు తమ హక్కుల గురించి తెలుసుకొని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మంచిర్యాల జిల్లా సీనియర్ సివిల్ జడ్జి నిర్మల అన్నారు. శనివారం మందమర్రి మున్సిపాలిటీ కార్యాలయంలో మెక్మా ఆర్పి లకు మహిళ చట్టాలపై అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ మహిళలకు మహిళా చట్టాల గురించి అవగాహన కలిపించేందుకు జిల్లావ్యాప్తంగా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గృహహింస, వరకట్నం వేధింపులు, ఆస్తి హక్కులు, లౌంగిక వేధింపులు, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టం, మాదక ద్రవ్యాల నుండి రక్షణ తదితరుల గురించి అవగాహన కల్పించడం ఈ ప్రచారంలో ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. డిఎల్ ఎస్ ఏ కార్యదర్శి ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల మండలాలు, కళాశాలలో స్వయం సహాయక సంఘాలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలలో ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు పై సంతకాలు చేసి ఇస్తున్నారని చెప్పారు. ఇలా అవగాహన లేకుండా చెక్కులపై సంతకాలు చేసి ఇస్తే భవిష్యత్తులో చిక్కుల్లో పడతారని హెచ్చరించారు. ప్రతి విషయాన్ని అవగాహన చేసుకున్న తర్వాతనే స్పందించాలని ఆమె కోరారు.

**న్యాయవాదుల ఉచిత న్యాయ సహాయం**

జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు డిఎల్ఎస్ఎ ద్వారా పూర్తిగా ఉచితంగా న్యాయ సేవ సహాయం అందిస్తున్నామని మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య, ఎండి సాంధాని, ఆర్ ఆర్ రాములు, సిహెచ్ సెల్వ రాజ్ లు అన్నారు. ఎవరికైనా న్యాయ సహాయం కావలిస్తే 24 గంటలు హెల్ప్ లైన్ నెంబర్ 15100 ఉపయోగించాలని వారు కోరారు. ముఖ్యంగా ఫోక్సో చట్టంపై ప్రతి మహిళకు పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాల వల్ల గ్రామీణ ప్రాంత మహిళలు, ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారని వారు పేర్కొన్నారు. అనంతరం సంచార లోక్ అదాలత్ వాహనం ద్వారా ఫోక్స్ చట్టంపై టీవీలో ప్రదర్శనను చూపించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మున్సిపాలిటీ కమిషనర్ తుంగపిండి రాజలింగు, మెక్మా అధికారి రఘురాం, న్యాయవాదులు మేకల రాజన్న, రంజిత్ గౌడ్, కిన్నెర శ్రీనివాస్, రమణ, కట్ల శ్రీనివాస్, లక్ష్మణ్, సదయ్య తదితరులు ఉన్నారు. అనంతరం మందమర్రిలో ప్రారంభం కానున్న మున్సిఫ్ న్యాయస్థాన భవనాన్ని న్యాయవాదులతో జిల్లా న్యాయమూర్తి నిర్మల సందర్శించారు.

# మెట్రో ప్రయాణికులకు పెరగనున్న నిరీక్షణ సమయం

- కొత్త కోచ్‌ల కొనుగోలు ప్రక్రియలో రెండేళ్ల జాప్యం
- కేంద్రం నుంచి రాష్ట్రానికి బదిలీ ప్రక్రియ ఆలస్యం కావడమే కారణం
- పీక్ అవర్స్‌లో తీవ్ర రద్దీతో కొనసాగుతున్న ప్రయాణికుల ఇబ్బందులు
- వాల్యుయేషన్ పూర్తయ్యాకే కోచ్‌ల కొనుగోలుకు మార్గం సుగమం



**హైదరాబాద్, మహా** : మెట్రోలో రద్దీ సమయాల్లో ప్రయాణించే వారికి నిరీక్షణ తప్పేలా లేదు. రైళ్లలో రద్దీ సమస్యకు ఇప్పట్లో పరిష్కారం లభించే అవకాశాలు కనిపించడం లేదు. కొత్తగా 60 కోచ్‌లను కొనుగోలు చేసే ప్రక్రియ సుమారు రెండేళ్ల పాటు ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణం. మెట్రో ఫేజ్ 1 నిర్వహణను కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేసే ప్రక్రియలో జాప్యం నెలకొంది. ఈ బదిలీ పూర్తయ్యాకే కొత్త కోచ్‌ల కోసం ఆర్డర్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావించినప్పటికీ, కేంద్రం నుంచి వచ్చిన తాజా ఆదేశాలతో ప్రతిపాదన నిలిచిపోయింది. మెట్రో ప్రాజెక్టు విలువను మరోసారి అంచనా వేయాలని కేంద్రం ఆదేశించడంతో కోచ్‌ల కొనుగోలుతో పాటు ఇతర కీలక నిర్ణయాలు వాయిదా పడ్డాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ క్యాప్స్ సంస్థ ఈ వాల్యుయేషన్ ప్రక్రియను నిర్వహిస్తోంది. ఇది పూర్తవడానికి సుమారు రెండు నెలల సమయం పట్టవచ్చని, పూర్తి స్థాయి బదిలీ ప్రక్రియ 2026 చివరి నాటికి కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఆ తర్వాతే బెంగళూరుకు చెందిన భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్‌కు కోచ్‌ల తయారీ కోసం ఆర్డర్ ఇవ్వడం సాధ్యమవుతుంది. ఆర్డర్ అందిన తర్వాత కోచ్‌ల తయారీ, సరఫరాకు కనీసం 15 నెలల సమయం పడుతుందని సదరు సంస్థ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో ప్రతిరోజూ సుమారు 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్, నాగోల్‌రాయదుర్గం, ఎల్బీ నగర్‌మియాపూర్ వంటి మార్గాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ, బదిలీ ప్రక్రియలోని సాంకేతిక అడ్డంకులు తొలగి కొత్త కోచ్‌లు అందుబాటులోకి వచ్చే వరకు ప్రయాణికులకు రద్దీ కష్టాలు తప్పేలా లేవు.



## అడుగు పెడితే చంపేస్తాం

( మొదటి పేజీ తరువాయి )

అక్కడి పోలీసులు ధృవీకరించారు. ఆ పోస్టు ఐపీ అడ్రస్ ను గుర్తించిన పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ ఐపీ అడ్రస్ నుంచి ఎవరు ఈ బెదిరింపులకు పాల్పడ్డారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈనెల 9వ తేదీన మోదీ ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో.. ఆయనకు ముందస్తు స్వాగతం పలుకుతూ ఆస్ట్రేలియా ఇండియన్ ఫౌండేషన్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. ఆ పోస్టుకు కౌంటర్‌గా నిందితులు బెదిరింపు పోస్టు పెట్టారు. దీంతో ఆస్ట్రేలియా ఫెడరల్ ఏజెన్సీ మోడీ పర్యటనకు మరింత భద్రతను కట్టుదిట్టం చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ ప్రధాని నరేంద్రమోదీ పలు దేశాల్లో పర్యటించనున్నారు.

# లైసెన్స్ సర్వేయర్ల సమస్యలను పాలకులు పట్టించుకోవాలి

**ప్రభుత్వం వెంటనే మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి**



**మహా వరంగల్ బ్యూరో ;** వరంగల్ పోచమ్మ మైదాన్ జంక్షన్ లో వీరనారి రుద్రమదేవి సాక్షిగా శనివారం పాలకుల కరుణ కోసం ఆశగా ఎదురుచూస్తూ జిల్లా సంఘం అధ్యక్షుడు దేవునూరి రాజు ఆధ్వర్యంలో సుమారు ముప్పై మంది లైసెన్సు సర్వేయర్లు శాంతియుతంగా నిరసన తెలిపారు. ఇటీవల మృతి చెందిన బంగారయ్య కు ఘనంగా నివాళులర్పించారు. ఏళ్ల తరబడి చదువులు అభ్యసించి సర్కారు వారు అందించిన కఠిన శిక్షణను పూర్తి చేసుకుని తమ బతుకులు మారతాయన్న ఎన్నో ఆశలతో నిరీక్షిస్తున్న రాష్ట్రవ్యాప్త ఆరు వేల ఐదు వందల మంది భూమి కొలిచే వారి కుటుంబాల్లో దట్టమైన కారుమబ్బులు అలుముకున్నాయని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు నెలల సుదీర్ఘ కాలంగా చేతిలో చిల్లిగవ్వ లేక కడుపు నిండా పట్టెడన్నం తినలేక కనీస అవసరాలు సైతం తీర్చుకోలేని దుస్థితిలో కుటుంబాన్ని ఎలా సాకా లో తెలియక అగమ్యగోచర స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. సరిగ్గా ఇదే క్రమంలో నాగర్ కర్నూల్ ప్రాంతానికి చెందిన తోటి మిత్రుడు బంగారయ్య ఉపాధి దొరకక నిండు చూలాలు అయిన ఇల్లాలికి కనీస వైద్యం చేయించే స్తోమత లేక మందులు కొనే దారి కానరాక అప్పుల ఊబిలో కూరుకుపోయి తీవ్ర మనోవేదనకు గురై గుండెపోటుతో అకాల మరణం చెందడం ప్రతి ఒక్కరి హృదయాలను కలచివేస్తోందని వారు కంటతడి పెట్టారు. కళ్లముందే తోటి కార్మికుడు నేలకొరగడం తమ వృత్తిదారులకు తీరని లోటని పుట్టబోయే బిడ్డకు తండ్రి ప్రేమ దక్కకుండా పోవడం ఆ అభాగ్యురాలి ఇల్లు దిక్కుతోచని స్థితిలో నడి వీధిన పడటం అత్యంత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. పాములు పురుగులు తిరిగే పొలాల్లో రైతుల భూములకు కొలతలు వేసే తమకు ఎకరానికి కేవలం యాభై రూపాయలు ఇస్తామనడం శ్రమకు తగిన గుర్తింపు ఏమాత్రం కాదని ఆ చాలీచాలని రాబడితో బతుకు బండి లాగడం అసాధ్యమని ప్రభుత్వ పాలకులకు విన్నవించారు. కష్టానికి తగిన ఫలితం దక్కనప్పుడు ఏ మనిషైనా ఎలా బతుకుతాడన్న ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. ఈ విషాద ఘటన పై అధికార యంత్రాంగం తక్షణమే మానవతా దృక్పథంతో స్పందించి మృతుని కుటుంబానికి ఐదు లక్షల రూపాయల తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు ఆ ఇంటికి పెద్దదిక్కుగా నిలవాలని ఆమెకు తగిన ఆధారం చూపి ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. మిగతా సర్వేయర్లకు కనీస వేతనంగా ముప్పై వేల రూపాయలు చెల్లించి భవిష్యత్తుకు పూర్తి భరోసా ఇచ్చేలా ఉద్యోగ భద్రత కుటుంబ రక్షణ కల్పించే దిశగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# పంట మార్పిడిపై దృష్టి పెట్టాలి!

**హైదరాబాద్, మహా.:** ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను వేగంగా పూర్తి చేయడం, పంట మార్పిడి విధానాలను విస్తృతంగా అమలు చేయడం, ఎరువుల సరఫరాలో ఎలాంటి కొరత రాకుండా చూడడం, వర్షాకాల వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

**ఆయిల్ పామ్ సాగు లక్ష్య సాధనపై దృష్టి**

హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, 2026-27 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో జిల్లా యంత్రాంగం కీలక పాత్ర పోషించాలని, రైతులను చైతన్యపరిచి ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ లో నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు.

**పంట మార్పిడి, కూరగాయల సాగుకు ప్రాధాన్యం**

సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా పంట మార్పిడి విధానాలను రైతులు విస్తృతంగా అనుసరించేలా వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేయాలని సీఎస్ ఆదేశించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కూరగాయల సాగును పెంచాలని, సూక్ష్మ సేద్య పద్ధతులను రైతులు అనుసరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుతూ తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించే సాంకేతికతలను ప్రోత్సహించాలని చెప్పారు.



**ఎరువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు**

యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు రైతులకు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సంజయ్ జాజు స్పష్టం చేశారు. ఎరువులను పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. జిల్లాల కలెక్టర్లు స్వయంగా ఎరువుల నిల్వలు, పంపిణీ, అక్రమ రవాణాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

**ఫార్మర్ రిజిస్ట్రీలో తెలంగాణ అగ్రస్థానం**

జిల్లాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రీ పురోగతిని సమీక్షించిన సీఎస్, దేశంలోనే 71.45 శాతం నమోదు పూర్తి చేసి తెలంగాణ తొలి స్థానంలో నిలిచిందని తెలిపారు. మిగిలిన నమోదు ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేసి ప్రతి రైతు వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

**వర్షా కాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ప్రజారోగ్య పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేసి దోమల నివారణ చ

# గంజాయి విక్రయ ముఠా గుట్టురట్టు

- ఇద్దరు నేపాలీలు అరెస్ట్
- బీటెక్ విద్యార్థులకు గంజాయి విక్రయం
- నకిలీ ఆధార్ కార్డులు, గంజాయి ప్యాకెట్లు స్వాధీనం

**కుషాయిగూడ, మహా :** గంజాయి విక్రయ ముఠాను కీసర పట్టుకున్నారు. గీతాంజలి కళాశాలలో చదువుతున్న బీటెక్ విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నేపాలీ వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.నిందితుల వద్ద నుంచి గంజాయి ప్యాకెట్లతో పాటు నకిలీ ఆధార్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ చిరునామాలతో ఉన్న ఆధార్ కార్డులను గుర్తించిన పోలీసులు వాటి నిజానిజాలపై విచారణ చేపట్టారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఒక్కో గంజాయి ప్యాకెట్‌ను రూ.300 నుంచి రూ.600 వరకు విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. అలాగే, నేపాల్‌కు చెందిన ఈ ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్‌లో గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలినట్టు పోలీసులు తెలిపారు.నిందితులను మరింత లోతుగా విచారిస్తున్నామని, ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని కీసర పోలీసులు పేర్కొన్నారు.

# కీసరలో వరుస ఇంటి చోరీల కేసుల ఛేదన

- ఏడుగురు అరెస్ట్
- జవహర్ నగర్ ఏసీపీ చక్రపాణి

**కుషాయిగూడ, మహా** : కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వరుస నాలుగు ఇంటి చోరీల కేసులను పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులకు సంబంధించి ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి తెలిపారు,. వారి వద్ద నుంచి సుమారు 22 తులాల బంగారు ఆభరణాలతో పాటు నేరాలకు ఉపయోగించిన బుల్లెట్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు డబ్బేట బాలలింగం గతంలో 45 క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్న హ్యాబిట్యువల్ ఆఫెండర్. నిందితులను సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులను ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన సీసీఎస్ బృందాన్ని జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి అభినందించారు. నిందితులను పట్టుకోవడంలో విశేష కృషి చేసిన పోలీసు సిబ్బంది సేవలను ఆయన ప్రశంసించారు. విలేకరుల సమావేశంలో కీసర సిఐ ఆంజనేయులు ఎస్ఐలు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అతడే ఓ సైన్యం...



ఒక్కడు.. ఒకే ఒక్కడు... అతడే ఓ సైన్యం... స్వయం కృషి ఆయన నైజం. సంక్షోభంలోనూ చెక్కు చెదరని ధైర్యం ఆయన సొంతం. ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన ధీరుడు. ఆయనే సీఎం అనుముల రేవంత్ రెడ్డి. పట్టు పట్ట రాదు. పట్టి వదల రాదు అనే సూత్రం ఆయన పాలిట నిజమైంద. సవాళ్లు, సమస్యలు, చికాకులు, చిక్కులు, వీటిని ఎలా అధిగమించాలో ఆయన బాగా తెలుసుకున్నారు. అనామకుడుగా రాజకీయ రంగ ప్రవేశం చేసి, అనతికాలంలోనే అత్యున్నత సీఎం పదవికి చేరిన యువ నేతగా ఇప్పుడు రేవంత్ ఎదిగిన తీరు ఓ అద్భుతం. మాటల్లో మేటి. చేతల్లో ఆయనకు ఆయనే సాటి. రాజకీయ ప్రస్థానంలో 20 ఏళ్ల నుంచి అంచెలంచలుగా ఎదుగుతూ వచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు రాజకీయాల్లో ఓ రేజింగ్ సూపర్ స్టార్. రాజకీయం అంటే ఇదే. వచ్చిన ప్రతీ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి కూల పరిస్థితిని కూడా అనుకూలంగా మార్చుకోవాలి. అవమానాలను అవకాశంగా మల్చుకోవాలి. ప్రత్యర్థుల బలహీనతలను ఒడిసి పట్టాలి. చావో, రేవో... ఇదే అంతిమ లక్ష్యం కావాలి. అన్నింటిని భరించే ఓపిక పెంచుకోవాలి... అనే లక్షణాలు రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో కనిపించే సత్యాలు. రాజకీయాల్లో మహా మహులు ఎదురైనా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో దూసుకుపోతే విజయలక్ష్మి వెన్నంటి వస్తుందనే విషయం రేవంత్ రెడ్డి విషయంలో నిజమైంది. రేవంత్ రెడ్డి విజయాల వెనుక వున్న రహస్యం ఏమిటీ? ఆయన ఆలోచనలు ఏమిటీ? అనే అంశాలు కొంచెం లోతుగా పరిశీలన చేస్తే ఆశ్చర్యపోయే విషయాలు అనేకం కనిపిస్తాయి.

రాజకీయాల్లో అసాధ్యమంటూ ఏది ఉండదు. ఆరు అణాలకు కూలీ చేసే అంజయ్య అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్టీఆర్ పెట్టిన తెలుగుదేశం పార్టీతో సామాన్యులు కూడా అమాత్యులయ్యారు. ఇది వారికి కలిసి వచ్చిన అదృష్టం. రేవంత్ రెడ్డి విషయంలో మాత్రం అదృష్టం ఒక్కటే ఆయనను అందలం ఎక్కించలేదు. ఆయన సీఎం పదవి వరకు ఎదిగేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. విద్యార్థి దశలో ఏబీవీపీలో ఓ సభ్యుడుగా మొదలైన ఆయన అడుగులు నెమ్మదిగా రాజకీయం వైపు నడిపించాయి. ఇండిపెండెంట్ గానే జెడ్ పీటీసీ ఎన్నికలలో, ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల్లో నెగ్గుకు వచ్చారు అంటే ప్రజల్లో ఆయన ఏ మేరకు విశ్వాసం సంపాదించారో అర్థం చేసుకోవచ్చు. టీడీపీలో చేరిన ఆయన రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించినా అనుకున్న స్థాయిలో పదవులు ఆయనను వరించ లేదు. టీడీపీతో బంధం తెంపుకుని కాంగ్రెస్ లో అడుగు పెట్టిన కొద్ది కాలానికే ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత తెలంగాణ కాంగ్రెస్ సారధ్య బాధ్యతలు ఆయనకు దక్కాయి. ఇక్కడి నుంచే ఆయనలో దాగివున్న అసలు సిసలైన రాజకీయ రేవంత్ రెడ్డి బయటకు వచ్చారు. అపర రాజకీయ చాణుక్యుడైన కేసీఆర్ ను దీటుగా ఎదుర్కొనే స్థాయికి రేవంత్ ఇట్టే ఎదిగిన తీరు రాజకీయ పరిశీలకులను సైతం ఆశ్చర్య పరిచింది. అప్పటి సీఎం కేసీఆర్ ను ఢీ కొట్టిన రేవంత్ తెలంగాణలో సుడిగాలి పర్యటనలు చేస్తూ జనంలోకి దూసుకుపోయారు. కాంగ్రెస్ లో ఇంటి పోరును తట్టుకుంటూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను విజయం వైపు నడిపించిన రేవంత్ రెడ్డి ఒక్కసారిగా దేశంలోనే ఓ సంచలన లీడర్ అయ్యారు. తెలంగాణకు రెండవ సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టింది మొదలు రేవంత్ రెడ్డి విభిన్న ఆలోచనలు, విధానాలకు ప్రాధాన్యత ఇస్తూ రాజకీయాల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.

కాంగ్రెస్ పార్టీలో లీడర్లకు కొదువ లేదు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు క్యాడర్ కన్నా లీడర్ల సంఖ్య ఎక్కువ. తెలంగాణ కాంగ్రెస్ లో పరిస్థితులు మరింత భిన్నంగా ఉంటాయి. కాంగ్రెస్ నాయకులలో పోటీ ఎక్కువ. ఎవరికీ వారే పదవుల కోసం ప్రయత్నం చేయటం సహజం. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ కావటంతో పార్టీలో ప్రజాస్వామ్యం కూడా చాలా ఎక్కువగానే ఉంటుంది. ఆ పార్టీ లీడర్లు అందరు ఒకే గొడుగుకిందకు రావాలి అంటే గట్టి నాయకత్వం ఉండాలి. వైస్సార్ పీసీసీ అధ్యక్షులుగా వున్న సమయంలో ఇది సాధ్యమైంది. ఆ తర్వాత రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షులుగా ఆ ఘనత సాధించిన నేతగా గుర్తింపు పొందారు. కాంగ్రెస్ పార్టీలో ఆది నుంచి అదే పార్టీని అంటి పెట్టుకున్న నాయకులు కోకొల్లలు. వీరందర్నీ కాదని, టీడీపీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన రేవంత్ రెడ్డికి తెలంగాణ సారధ్య బాధ్యతలు కాంగ్రెస్ అధిష్టానం అందించింది. అప్పట్లో దీన్ని తీవ్రంగా వ్యతిరేకించిన కొందరు తెలంగాణ కాంగ్రెస్ నేతలను రేవంత్ రెడ్డి తన చాకచక్యంతో దారికి తీసుకొని వచ్చారు. ఇది ఆయన రాజకీయ ఎత్తుగడకు ఓ మచ్చుతునక. ఇక టీపీసీసీ అధ్యక్షులుగా ఆయన ఓ పెద్ద బాధ్యత భుజం మీద వేసుకున్నారు. అదే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొని రావటం. అప్పటికి తెలంగాణలో అధికార బీఆర్ఎస్ పూర్తి బలంగా వుంది. సీఎంగా కేసీఆర్ తిరుగులేని శక్తిగా వున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పరిస్థితి బీఆర్ఎస్ ను ఢీ కొంటుందా? అనేలా ఉండేవి. ఇలాంటి ప్రతికూల వాతావరణంలో రేవంత్ తన నాయకత్వ ప్రతిభకు పదును పెట్టారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ ప్రాంతానికి వెళ్లారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పిదాలు గట్టిగా ఎండ గట్టి ఢీ అంటే ఢీ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎలాంటి సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తుందో క్షేత్ర స్థాయి వరకు చేరేలా చేశారు. అంతే. ప్రజలు రేవంత్ పక్షం వైపు మళ్ళారు. తెలంగాణలో తిరుగే లేదనుకున్న బీఆర్ఎస్ కు షాక్ ఇచ్చారు. సీఎంగా రేవంత్ పగ్గాలు చేపట్టారు. ఇక్కడే ఆయన ఓ కొత్త నినాదం అందుకున్నారు. అదే ప్రజా పాలన. ప్రజలదే ఈ ప్రభుత్వం అంటూ పాలన మొదలు పెట్టారు. ప్రజా వేదికలకు, ప్రజావాణికి శ్రీకారం చుట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పిదాలు ప్రజలకు వివరిస్తూ సంక్షేమ పథకాలు, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయటం పైన దృష్టి పెట్టారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పంపిణి మొదలుకుని అనేక కార్యక్రమాలు అందుకున్నా రేవంత్ రెడ్డి భవిష్యత్ వ్యూహం పైన కూడా అదే స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేశారు. రేవంత్ రెడ్డికి ఇప్పుడు కొన్ని అత్యంత ప్రాధాన్యత అంశాలు ముందు వున్నాయి. ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ ప్రక్షాళన, సాగు, తాగు నీటి ప్రాజెక్ట్ ల నిర్మాణం, హైదరాబాద్ లో మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలు సీఎం ప్లాన్ లో వున్నాయి. వీటిని వచ్చే రెండున్నర ఏళ్లలో ఓ దశ వరకు తీసుకొని రావాలి అన్నది ఆయన సంకల్పం. దాని కోసం ఇప్పుడు ఆయన విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. అవసరమైన నిధుల కోసం ఏకంగా కేంద్రంతోనే ఆయన సై అంటే సై అంటున్నారు. రేవంత్ రెడ్డి పట్టుదల ప్రధాని మోడీని కూడా ఆకట్టుకుంది. ఓ దశలో సుతి మెత్తగా హమ్ సే జోడో అంటూ రేవంత్ కు ఆఫర్ కూడా ఇచ్చారు. అంటే ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఓ పరిణతి చెందిన నాయకుడుగా ఎదిగి పోయారు అన్నది సుస్పష్టం అవుతోంది. ఓ వైపు కేంద్రంతో గట్టిగానే ఢీ కొంటున్న రేవంత్ అదే సమయంలో కేంద్ర పెద్దలను ప్రసన్నం చేసుకొని రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన ప్రయోజనాలు రాబట్టుకునే వ్యూహం కూడా అమలు చేస్తున్నారు. రేవంత్ లో సమయానుకూల వ్యవహార శైలీ తలలు పండిన రాజకీయ నాయకులను కూడా ఆశ్చర్య పోయేలా చేస్తోంది. ఓ వైపు రాష్ట్ర కాంగ్రెస్ నేతలను కలుపుకొని పోవటం, కాంగ్రెస్ అధిష్టానం వద్ద తన బలం తగ్గకుండా చూసుకోవటం, కేంద్రం తో పనులు చేయించుకోవటం, రాజకీయ ప్రత్యర్థులను అదుపులో పెట్టటం ఇలా ఆయన బహుముఖ ప్రజ్ఞ ఇప్పుడు ప్రదర్శిస్తూ దూసుకుపోతున్నారు. రేవంత్ రెడ్డికి అసలు అగ్ని పరీక్షలు మున్ముందున్నాయి. ఈ రెండున్నరేళ్ల పాలన ఓ ఎత్తు అయితే వచ్చే రెండున్నరేళ్ళ పాలన మరో ఎత్తు. ఓ వైపు విపక్షాలు పట్టు బిగిస్తున్నాయి. అభివృద్ధి అంశాలు ఎదురుగా నిలిచి సవాళ్లు విసురుతున్నాయి. సొంత కాంగ్రెస్ పార్టీ నుంచి కొందరు నేతలు తల నొప్పులు వెంటాడుతున్నాయి. అన్నింటికీ మించి సీఎం రేవంత్ రెడ్డిపైన తెలంగాణ ప్రజలు చాలా ఆశలు పెట్టుకున్నారు. రైతులు, మహిళలు, యువత, బడుగు, బలహీన వర్గాలు రేవంత్ చేయూత కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల కోసం రాష్ట్ర యువత చాలా ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ప్రభుత్వం ఇచ్చింది. ఇక మున్ముందు మరిన్ని ఉద్యోగాలు నోటిఫికెషన్స్ ఇప్పుడు జారీ అవుతున్నాయి. వీటిని వివాదాలు లేకుండా భర్తీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన వుంది. ప్రాజెక్ట్ ల నిర్మాణం, ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రక్షాళన, మెట్రో రెండో దశ పనులు సీఎం రేవంత్ కు సవాల్ విసురుతున్నాయి. మరో వైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయాల్సిన అవసరం వుంది. అంటే ఇప్పటి వరకు రేవంత్ సాగించిన పాలన ఓ ఎత్తు అయితే వచ్చే రెండున్నర ఏళ్ల పాలన మరో ఎత్తు అన్నది ఇక్కడ స్పష్టంగా తెలుస్తోంది. ఎలాంటి సమస్యను అయినా ఎదుర్కొనే సత్తా రేవంత్ కు వుంది. అయితే ఇప్పుడు ఆయన ఎదుట నిలిచిన ఈ ప్రాధాన్యత అంశాలు పూర్తి చేస్తూ మరో సారి కాంగ్రెస్ ను తెలంగాణలో అధికారంలోకి తెచ్చేందుకు ఎలాంటి ప్లాన్ తో రేవంత్ ముందుకు సాగుతారనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. సవాళ్ళను విజయ సోపానాలుగా మల్చుకుంటూ సీఎం స్థాయికి ఎదిగిన రేవంత్ మున్ముందు ఎలాంటి ఎత్తుగడలతో అడుగులు వేస్తారో వేచి చూడాలి. కృషి ఉంటే మనుషులు ఋషులు అవుతారని, మహా పురుషులు అవుతారని ఓ కవి చెప్పిన మాటలు రేవంత్ నిజం చేస్తున్న వైనం చూస్తున్న జనం అతడే ఓ సైన్యం అని మురిసి పోతున్నారు.



**జీ. వెంకటరమణ**
**సీనియర్ జర్నలిస్ట్**

# బుల్లెట్ రైలు విప్లవం..

ప్రపంచంలో అభివృద్ధికి నేడు కొత్త కొలమానం రహదారులు కాదు.. విమానాశ్రయాలు మాత్రమే కాదు.. అత్యాధునిక బుల్లెట్ రైలు వ్యవస్థ కూడా. గంటకు 200 కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకెళ్లే హైస్పీడ్ రైళ్లు దేశ ఆర్థికాభివృద్ధికి, పరిశ్రమలకు, పర్యాటకానికి, ఉపాధికి కొత్త ఊపిరి పోస్తున్నాయి. ఈ రంగంలో చైనా తిరుగులేని ఆధిపత్యం చాటుకుంటుండగా, స్పెయిన్, జపాన్, ఫ్రాన్స్ వంటి దేశాలు దశాబ్దాల క్రితమే బుల్లెట్ రైళ్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చాయి. భారత్ మాత్రం ఆలస్యంగా ప్రారంభించినా, ఇప్పుడు అత్యాధునిక సాంకేతికతతో భవిష్యత్తు కోసం బలమైన పునాదులు వేస్తోంది. ప్రపంచ గణాంకాలు, భారత ప్రణాళికలు పరిశీలిస్తే రాబోయే దశాబ్దంలో భారత్ కూడా హైస్పీడ్ రైల్వే రంగంలో కీలక దేశంగా ఎదిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో అత్యంత పెద్ద హైస్పీడ్ రైల్వే నెట్‌వర్క్ చైనాదే. అక్కడ ఇప్పటికే 45 వేల కిలోమీటర్లకు పైగా హైస్పీడ్ మార్గాలు ఉండగా, 2024 చివరి నాటికి ఆ నెట్‌వర్క్ దాదాపు 48 వేల కిలోమీటర్లకు చేరుకుంది. 2030 నాటికి 60 వేల కిలోమీటర్లకు విస్తరించాలన్న లక్ష్యంతో చైనా ముందుకెళ్తోంది. కొత్త నగరాలను అనుసంధానం చేయడం, పరిశ్రమలకు వేగవంతమైన రవాణా, ప్రాంతీయ అసమానతలను తగ్గించడం వంటి లక్ష్యాలతో భారీగా పెట్టుబడులు పెట్టింది. స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు ఇప్పటికే తమ ప్రధాన నగరాలను హైస్పీడ్ రైళ్లతో అనుసంధానించాయి. దీంతో విమాన ప్రయాణాలపై ఆధారపడే అవసరం తగ్గింది. తక్కువ సమయంలో సురక్షిత ప్రయాణం సాధ్యమవుతోంది. యూరప్‌లో సరిహద్దులు దాటి కూడా వేగవంతమైన రైలు సేవలు అందుబాటులో ఉండటంతో వ్యాపారం, పర్యాటకం మరింత అభివృద్ధి చెందుతున్నాయి.

**భారత్ దూకుడు**

ప్రస్తుతం భారత్‌లో వాణిజ్యపరంగా నడుస్తున్న బుల్లెట్ రైలు లేదు. అయితే దేశ చరిత్రలో తొలి హైస్పీడ్ రైల్వేగా ముంబై-అహ్మదాబాద్ కారిడార్ నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. ఇది 508 కిలోమీటర్ల పొడవుతో గంటకు 320 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడిచేలా రూపుదిద్దుకుంటోంది. ఈ ప్రాజెక్టులో జపాన్ షింకాన్‌సెన్ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. కేంద్ర రైల్వే మంత్రి వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం, ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టులో సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయి. గుజరాత్‌లోని సూరత్-బిలిమోరా మధ్య తొలి దశను 2027లో ప్రారంభించే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయి. జపాన్ ప్రభుత్వం కూడా ఈ లక్ష్యానికి పూర్తి మద్దతు ప్రకటించింది. భారత్‌లో వేగంగా పట్టణీకరణ జరుగుతోంది. పెద్ద నగరాల మధ్య ప్రయాణాల డిమాండ్ పెరుగుతోంది. బుల్లెట్ రైళ్లు అందుబాటులోకి వస్తే విమానాశ్రయాలపై ఒత్తిడి తగ్గుతుంది. పరిశ్రమలు, ఐటీ, తయారీ రంగాలకు వేగవంతమైన రవాణా లభిస్తుంది. వేలాది ఉద్యోగాలు ఏర్పడటంతో పాటు నిర్మాణ రంగం, ఉక్కు, సిమెంట్, విద్యుత్, యంత్రాల పరిశ్రమలకు కూడా ఊతం లభిస్తుంది. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి కూడా ఇది కీలకంగా మారనుంది. ముంబై-అహ్మదాబాద్ కారిడార్‌తో ఆగకుండా దేశవ్యాప్తంగా పలు హైస్పీడ్ కారిడార్లపై కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఢిల్లీ-వారణాసి, ముంబై-పుణే, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు వంటి మార్గాలు భవిష్యత్ హైస్పీడ్ నెట్‌వర్క్‌లో చోటు దక్కించుకునే అవకాశం ఉంది. చైనా చూపించిన అనుభవం ప్రకారం హైస్పీడ్ రైళ్లు కేవలం వేగం కోసం మాత్రమే కాదు, ఆర్థిక వ్యవస్థను వేగవంతం చేసే సాధనంగా మారాయి. నగరాల మధ్య దూరాలు తగ్గడంతో పెట్టుబడులు పెరిగాయి. కొత్త పరిశ్రమలు ఏర్పడ్డాయి. ప్రాంతీయ అభివృద్ధి వేగం అందుకుంది. భారత్ కూడా ఈ అనుభవాలను వినియోగించుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వదేశీకరించగలిగితే రాబోయే దశాబ్దంలో ప్రపంచ హైస్పీడ్ రైల్వే రంగంలో కీలక స్థానాన్ని సంపాదించే అవకాశం ఉంది. మహా డెస్క్





# అగ్రరాజ్యాల సరసన నూతన భారత్: ప్రపంచ శక్తిగా కదం తొక్కుతున్న దేశం!

**హైదరాబాద్, మహా**

:ప్రపంచ రాజకీయ ముఖచిత్రం వేగంగా మారుతోంది. ఒకప్పుడు అమెరికా, రష్యా, ఐరోపా దేశాల చుట్టూ తిరిగిన అంతర్జాతీయ సమీకరణాలు ఇప్పుడు ఆసియా వైపు మళ్లుతున్నాయి. ఈ క్రమంలో ప్రపంచ ప్రజాస్వామ్య వ్యవస్థకు నాయకత్వం వహించే సామర్థ్యం ఉన్న దేశంగా భారత్‌పై ప్రపంచ దృష్టి కేంద్రీకృతమవుతోంది. తాజా అంతర్జాతీయ అధ్యయనంలో ప్రపంచ అత్యంత శక్తివంతమైన దేశాల జాబితాలో భారత్‌కు 12వ స్థానం లభించింది. అణ్వాయుధాలు, సైనిక బలగాలతోనే దేశాల శక్తిని కొలిచే రోజులు పోయాయి. నేడు ఒక దేశ ప్రభావాన్ని దాని ఆర్థిక బలం, సాంకేతిక సామర్థ్యం, దౌత్యం, ప్రపంచ వాణిజ్యంలో వాటా, సైబర్ సామర్థ్యం, అంతరిక్ష కార్యక్రమాలు నిర్ణయిస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఆహార దిగుమతులపై ఆధారపడిన దేశం, నేడు ప్రపంచానికే ఆహార భద్రత కల్పించే స్థాయికి ఎదగడం, విదేశీ సాంకేతికత కోసం ఎదురుచూసిన దశ నుంచి చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా చరిత్ర సృష్టించడం భారత ప్రస్థానానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**ఆర్థిక మహాశక్తిగా, డిజిటల్ దిక్సూచిగా...**

గత పదేళ్లలో భారత్ ఆర్థిక రంగంలో సాధించిన పురోగతి ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. భారీ మౌలిక సదుపాయాల నిర్మాణం, విదేశీ పెట్టుబడుల పెరుగుదల, స్టార్టప్‌ల విస్తరణతో ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిన భారత్.. త్వరలోనే మూడో స్థానానికి చేరుకుంటుందని ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలు అంచనా వేస్తున్నాయి. అలాగే, ప్రపంచ దేశాలు నేడు భారత డిజిటల్ మౌలిక వసతులను అధ్యయనం చేస్తున్నాయి. యూపీఐ చెల్లింపుల వ్యవస్థ కోట్లాది లావాదేవీలను క్షణాల్లో పూర్తి చేస్తుండగా, ఆధార్, ప్రత్యక్ష నగదు బదిలీ వంటివి ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేశాయి. మరోవైపు, పనిచేసే వయస్సు ఉన్న జనాభా అధికంగా ఉండటం భారత యువశక్తికి అతిపెద్ద బలంగా మారింది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఇప్పటికే ప్రపంచ ఐటీ రాజధానిగా ఎదిగిన భారత్, ఇప్పుడు కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ భద్రత రంగాల్లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ ఆర్థిక శక్తికి అదనపు బలాన్ని చేకూరుస్తోంది.

***రక్షణ స్వావలంబన.. అంతరిక్ష అద్భుతాలు***

ఒకప్పుడు విదేశీ ఆయుధాలపై ఆధారపడిన భారత్ ఇప్పుడు స్వదేశీ యుద్ధనౌకలు, క్షిపణులు, డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది. బ్రహ్మోస్ క్షిపణులు, తేజస్ యుద్ధ విమానాలు, ఐఎన్ఎస్ విక్రాంత్ వంటి ప్రాజెక్టులతో పాటు రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు పెరగడం భారత వ్యూహాత్మక బలాన్ని పెంచుతోంది. అంతరిక్ష పరిశోధనల్లో తక్కువ వ్యయంతో క్లిష్టమైన ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించడం మన ప్రత్యేకత. చంద్రయాన్3, ఆదిత్యఎల్1 విజయాల తర్వాత, గగన్‌యాన్ మిషన్‌తో మానవ సహిత అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతూ భవిష్యత్ అంతరిక్ష సాంకేతికతలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది.

**దౌత్య నీతి.. చైనాకు ప్రత్యామ్నాయం**

భారత విదేశాంగ విధానం గత కొన్నేళ్లుగా కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకవైపు అమెరికా, ఫ్రాన్స్, జపాన్, ఆస్ట్రేలియా వంటి ప్రజాస్వామ్య దేశాలతో (క్వాడ్) వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తూనే, బ్రిక్స్, షాంఘై సహకార సంస్థ వేదికల్లో చైనా, రష్యాతో కలిసి పనిచేయడం భారత దౌత్య సమతుల్యతకు ప్రతీక. జీ20 అధ్యక్ష బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, ఆఫ్రికన్ యూనియన్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించడంలో కీలక పాత్ర పోషించి ప్రపంచానికి తన నాయకత్వ సామర్థ్యాన్ని భారత్ నిరూపించింది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా వ్యవస్థల మార్పులతో అంతర్జాతీయ సంస్థలు 'చైనా ప్లస్ వన్' వ్యూహంతో భారత్ వైపు చూస్తున్నాయి. 'మేక్ ఇన్ ఇండియా', పారిశ్రామిక కారిడార్లు, నూతన రాయితీ పథకాలతో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఔషధ తయారీలో భారత్ ప్రపంచ తయారీ కేంద్రంగా వేగంగా ఎదుగుతోంది.

**వికసిత్ భారత్ దిశగా అప్రతిహత యాత్ర**

వాతావరణ మార్పులు, ఉగ్రవాద నిరోధం, సముద్ర భద్రత, ఆహార భద్రత వంటి ఏ కీలక అంతర్జాతీయ అంశమైనా నేడు భారత స్వరం లేకుండా చర్చలు పూర్తి కావడం లేదు. స్వాతంత్ర్య శతాబ్ది నాటికి (2047) అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న లక్ష్యంతో హైస్పీడ్ రైల్వేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, నూతన ఓడరేవులు, హరిత ఇంధన ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఈ అద్భుతమైన మార్పులు, ఆర్థిక స్థిరత్వం, ప్రజాస్వామ్య విలువల కలయికే భారత్‌ను ఇతర దేశాల కంటే ప్రత్యేకంగా నిలబెడుతోంది. నేడు 12వ స్థానంలో ఉన్నా, ప్రపంచ శక్తిగా అవతరించే దిశగా ధైర్యంగా ముందుకు సాగుతున్న భారత్, భవిష్యత్తులో అగ్రశ్రేణి ప్రపంచ శక్తిగా నిలవడం ఖాయమని అంతర్జాతీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.





# ఉద్యోగానికి క్రమశిక్షణే ముఖ్యం

- **సింగరేణి సెక్యూరిటీ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**: ఉద్యోగానికి క్రమశిక్షణే ముఖ్యమని ఏరియా సింగరేణి సెక్యూరిటీ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్ అన్నారు. సింగరేణి ఎస్ అండ్ పిసి ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరిగిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం ట్రైనింగ్ సెంటర్లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యం అని మనం క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నపుడే మనకు గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ వలన డ్యూటీ జీవితంలోనే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఉపయోగకరమైనదని చెప్పారు. ఈ నాలుగు రోజుల శిక్షణా కాలంలో ట్రాఫిక్ రెగ్యులేటరీ చట్టం మాండేటరీ కాషనరీ ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్ ట్రాఫిక్ పాయింట్ మన్ డ్యూటీస్ క్రౌడ్ కంట్రోల్ వంటి అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే పూర్తి అవగాహన కలిగించడం జరిగినదని తెలిపారు. ఈ శిక్షణ వలన ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా మెయిన్ గేటు వద్ద చెక్ పోస్ట్ ల వద్ద రద్దీ లేకుండా సాఫీగా అందరు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు దోహదం చేస్తుందని ఎస్ అండ్ పిసి విభాగం పటిష్టంగా ఉండేందుకు కావలసిన అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ట్రైనింగ్ సెంటర్ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుందని కావున సెక్యూరిటీ సిబ్బంది అందరు మెరుగైన వృత్తి నైపుణ్యంతో అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సింగరేణి ఆస్తులు స్థలాలను పరిరక్షించాలని సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. అనంతరం ఉత్తమ ట్రైనీలుగా ఎంపిక అయిన యం.డి.భహబూబ్ అలీ, పి.లింగమూర్తిలకు బహుమతి ప్రదానం చేశారు. శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ అనాథ ఆశ్రమ పిల్లలకు నోట్ బుక్స్, పెన్నులు వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో డి.నారాయణరెడ్డి ట్రైనింగ్ ఇన్ స్పెక్టర్, కె.రాజనర్సు జూనియర్ ఇన్స్ పెక్టర్, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి అభివృద్ధికి కేంద్రం జోక్యం చేసుకోవాలి

- **బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**
- **కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాలి**
- **కంపెనీకి రావాల్సిన బకాయిల వసూళ్ల విషయంపై చర్యలు చేపట్టాలి**
- **కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**: సింగరేణి మనుగడకు కేంద్రం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం సింగరేణి భవన్లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నతపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మనుగడ, సంస్థ ఆర్థిక బలోపేతం కొత్త బొగ్గు గనుల కేటాయింపు రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుండి రావాల్సిన బకాయిల వసూళ్లు తదితర కీలక అంశాలపై సమగ్రంగా ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రస్తుతం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అనాలోచిత అసమర్థ విధానాల కారణంగా సింగరేణి ఆర్థిక పరిస్థితి బలహీనపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పలు గనుల్లో బొగ్గు నిల్వలు తగ్గిపోవడంతో భవిష్యత్తులో కొన్ని గనులు మూతపడే ప్రమాదం నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

**బకాయిలు వసూలు చేయాలి..**

సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్కో, జెన్కో తదితర సంస్థల నుండి రావాల్సిన సుమారు రూ.56,000 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించేలా కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా తాడిచెర్ల బొగ్గు బ్లాక్-2, మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టులను సింగరేణికి కేటాయించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇల్లందు పూసపల్లి ఓసీ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించేలా సింగరేణి యాజమాన్యానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తాడిచెర్ల బొగ్గు బ్లాక్-2లో సుమారు 277 మిలియన్ టన్నుల, మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టులో సుమారు 215 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని పేర్కొంటూ ఈ గనులను సింగరేణికి కేటాయించడం ద్వారా సంస్థ భవిష్యత్తు మరింత బలోపేతం కావడంతో పాటు వేలాది మంది కార్మికుల ఉపాధికి శాశ్వత భరోసా లభిస్తుందని వివరించారు. మణుగూరు ప్రాంతంలోని ప్రస్తుతం కొనసాగుతున్న గనుల్లో బొగ్గు నిల్వలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో పీకే ఓసీ-2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టు సింగరేణికి దక్కడం అత్యంత అవసరమని తెలిపారు. ఈ ప్రాజెక్టు ఫైనాన్షియల్ బిడ్ వేలంలో సింగరేణి తప్పనిసరిగా పాల్గొనేలా ఆదేశాలు జారీ చేసి వేలం ద్వారా ఆ గనిని సింగరేణికే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. బొగ్గు తవ్వకాల రంగంలో సింగరేణికి ఉన్న శతాబ్ద కాలపు అనుభవం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నైపుణ్యం కలిగిన ఉద్యోగులు సమర్థవంతమైన యంత్రాంగం బలమైన మౌలిక సదుపాయాలు ఈ ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహించే పూర్తి సామర్థ్యం సింగరేణికే ఉందని పేర్కొన్నారు. ఈ అంశాలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంతో సమీక్ష నిర్వహించి కొత్త గనుల కేటాయింపు బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దీంతో వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రతతో పాటు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి, దేశ ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతుందని బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు.

# చెల్లింపుల ప్రక్రియలను వేగవంతం చేయాలి

**జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** టెర్మినల్ బెనిఫిట్స్ గ్రాట్యుటీ చెల్లింపుల ప్రక్రియలనువేగవంతం చేయాలని జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి. కిరణ్ కుమార్ ఆదేశించారు. శనివారం సింగరేణి ప్రధాన కార్యలయ జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ ఛాంబర్ నుండి జనరల్ మేనేజర్(పర్సనల్) వెల్ఫేర్ జి.వి.కిరణ్ కుమార్ అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియాల వారీగా పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో పెండింగ్ లో ఉన్న పెన్షన్ క్లెయిమ్స్ టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులు గ్రాట్యుటీ క్వార్టర్స్ కారుణ్య నియామకాలకి సంబంధించిన విషయాల గురించి సమీక్షించి టెర్మినల్ బెనిఫిట్స్ గ్రాట్యుటీ చెల్లింపుల ప్రక్రియలనువేగవంతం చేయాలని తెలిపారు. పదవీ విరమణ పొందే ఉద్యోగుల సిఎంపిఎఫ్ పెన్షన్ క్లెయిమ్స్ సెటిల్మెంట్ విషయంలో ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన సెటిల్మెంట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరిఖని రీజియన్ పరిధిలో ఇటీవల పెండింగ్ లో ఉన్న పెన్షన్ క్లెయిమ్ లను రీజనల్ కమీషనర్ లకు వెంటనే మరలా పంపి వారితో మాట్లాడి పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్)లు శ్రీ కేసా నారాయణ రావు, బి.శివకేశవరావు, ముకుంద సత్యనారాయణ, డివై.పిఎంలు కే.సునీల్ కుమార్, కే.శివ కుమార్, సీనియర్ పిఓ మండల శ్రీనివాస్ అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నా

# కొడుకును కడతేర్చిన తండ్రి

- **మృతుడికి భార్య ఇద్దరు చిన్న కుమారులు**
- **హత్య చేసి పరారీ అయిన కీచక తండ్రి**
- **హత్యపై గ్రామస్తుల్లో పలు అనుమానాలు.**



**సత్తుపల్లి, జూలై 4: మహా :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీలో తండ్రి కొడుకుని హత్య చేసిన వార్త తీవ్ర కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు కాలనీకి చెందిన కొత్తపల్లి కిరణ్ కుమార్ (33సం") అనే యువకుడు భార్య జ్యోతి (30సం) ఇద్దరు మగ పిల్లలతో కలిసి తల్లిదండ్రుల ఇంటిలో ఉమ్మడిగా నివాసం ఉంటున్నారు. వీరి కుటుంబ నేపథ్యం సజావుగా సాగుతున్నప్పటికీ శుక్రవారం రాత్రి ఆకస్మిక ఘటన చోటుచేసుకుంది. తండ్రి కొడుకును మద్యం సేవించడానికి రావాలని కోరడంతో ఇద్దరు మద్యం దుకాణంలో మద్యం సేవించి ఇంటికి చేరుకున్నారు. అనంతరం తండ్రి ఘర్షణ ప్రారంభించి అధికంగా మద్యం సేవించిన కన్న కొడుకు పై ఒక్కసారిగా విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. దాడిలో తలకు బలమైన గాయం కావడంతో కిరణ్ కుమార్ ఘటన స్థలంలోనే కుప్పకూలిపోయాడు. స్థానికులు బాధితున్ని హుటాహుటిన కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అప్పటికే కిరణ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

**పథకం ప్రకారమే హత్య**

ఈ హత్యపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆటో డ్రైవర్ గా పనిచేస్తూ హత్యకు కారకుడైన కీచక తండ్రి కొత్తపల్లి సీతారాములు చెడు వ్యసనాలకు బానిసై గ్రామంలో పలు నేరాలకు పాల్పడేవాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తండ్రి, కొడుకు కి మద్యం త్రాగే అలవాటు ఉన్నప్పటికీ ఇద్దరూ కలిసి మద్యం సేవించడం ఎప్పుడు చూడలేదని, శుక్రవారం రాత్రి పథకం ప్రకారమే కొడుకుకి అధికంగా మద్యం త్రాగించి కొడుకు బలహీనంగా ఉన్న సమయంలో హత్య చేసి పరారీ అయ్యాడని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న అంతకుడు కొత్తపల్లి శ్రీరాములను పట్టుకోవడానికి నాలుగు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్టు ఎస్.ఐ తెలిపారు.



# దొడ్డి కొమరయ్య 80 వ వర్థంతి వేడుకలు

- **దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు ఉద్యమిద్దాం ..**
- **సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్.**

**సత్తుపల్లి, జూలై 4**: మహా. : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్థంతి వేడుకలు సి.పి.ఎం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో కాకర్లపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. భూస్వామ్య, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతాంగం, పేద ప్రజల హక్కుల కోసం ఆయన ప్రాణ త్యాగం చేశారని కొనియాడారు. నేటి తరానికి దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శంగా నిలవాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అదే పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దొడ్డి కొమరయ్య కలలుగన్న దోపిడీ లేని సమ సమాజ స్థాపన కోసం ఆయన స్ఫూర్తితో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, మండల కమిటీ సభ్యులు బండి వేలాద్రి, కువ్వారపు లక్ష్మణరావు, అయినంపూడి సనంద రావు, బెజవాడ కృష్ణవేణి, షేక్ యాకుబ్ పాషా, అఫ్జల్, బెజవాడ లక్ష్మీనారాయణ, లక్ష్మి, రమాదేవి, నాగేశ్వరరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## కిష్టారం గనిలో ఫిట్ సెక్రటరీగా
# షణ్ముఖ చారి నియామకం

- **గని మేనేజర్ రామకృష్ణ చేతుల మీదుగా నియామక పత్రం అందజేత.**

**సత్తుపల్లి, జూలై 4: మహా :** సింగరేణి గుర్తింపు సంఘం ఐ.ఎన్.టి.యు.సి యూనియన్ సెక్రెటరీ జనరల్, కనీస వేతన సలహా మండలి అధ్యక్షులు జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సత్తుపల్లి ఏరియా యూనియన్ వైస్ ప్రెసిడెంట్ బి కోటేశ్వరరావు కృషితో కిష్టారం ఉపరితల గని ఫిట్ సెక్రటరీగా షణ్ముఖ చారి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం గని మేనేజర్ రామకృష్ణ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి యూనియన్ వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు నూతనంగా పదవిని అలంకరించిన షణ్ముఖ చారి కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కిష్టారం గనిలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమస్యను పరిష్కరించడానికి ఎల్లవేళలా కృషి చేయాలని సూచించారు. యాజమాన్యంతో సత్సంబంధాలు కలిగి వారి సూచనలు పాటిస్తూ కార్మికుల క్షేమానికి పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీలు నాగ ప్రకాష్, మురళి కృష్ణ, జేవిఆర్ గని ఫిట్ సెక్రెటరీ సీతారామరాజు, కేడం కోటేశ్వరరావు, ఇక్బాల్, రాజశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.





# కార్మికుల భద్రతకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- **పీవీకే-5 ఇంక్లైన్ను సందర్శించిన భూగర్భ గనుల జీఎం**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**:కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సింగరేణి భూగర్భ గనుల జనరల్ మేనేజర్ కె.యాదయ్య అన్నారు. కొత్తగూడెం ఏరియాలోని పీవీకే5 ఇంక్లైన్ భూగర్భ గనిని సింగరేణి భూగర్భ గనుల జనరల్ మేనేజర్ కె.యాదయ్య శనివారం సందర్శించి గనిలో జరుగుతున్న ఉత్పత్తి ఉత్పాదకత భద్రతా ప్రమాణాలు నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాల సాధనపై సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా గనిలోని వివిధ పనిస్థలాలను పరిశీలించిన ఆయన భద్రతా నిబంధనలను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకుండా కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉత్పత్తి లక్ష్యాలను నాణ్యతతో సమయపాలనతో సాధించడంతో పాటు ఉత్పాదకతను మరింత పెంచేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం గని నిర్వహణ భద్రతా ఏర్పాట్లు యంత్రాల పనితీరు ఉత్పత్తి పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల్లో నాణ్యత సామర్థ్యం పెంపునకు అవసరమైన సూచనలు చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జీఎం ఎం.గోవిందరావు, ఏరియా ఇంజనీర్ వి.రామకృష్ణ, పీవీకే5 ఇంక్లైన్ ఏజెంట్ రామ్ భరోస్ మెహతో, గ్రూప్ ఇంజనీర్ గోదావరి శ్రీనివాసరావు, మేనేజర్ పి.రవికిరణ్, సేఫ్టీ ఆఫీసర్ అనిల్ సాగర్, పిట్ ఇంజనీర్ శ్రీనివాస్, ఇంజనీర్(ఈ అండ్ఎం) బి.శివరామ్ తదితర అధికారులు పాల్గొన్నారు

# ఈరి కి నివాళులర్పించిన ఎంఈఓ జయరాజు



**కారేపల్లి, మహా:** మండల పరిధిలోని అప్పాయిగూడెం పంచాయతీ భిక్య తండ గ్రామానికి చెందిన మండల మాజీ ప్రధాన కార్యదర్శి , సీనియర్ జర్నలిస్ట్ అజ్మీర వీరన్న తల్లి అజ్మీర ఈరి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి మృతురాలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతురాలి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. వారి వెంట సిబ్బంది మోతిలాల్, విజయ్, రాము, నాయకులు రామ్ కిషోర్ తదితరులు ఉన్నారు.

## భద్రాద్రి గ్రీన్‌ఫీల్డ్ "ఎయిర్‌పోర్టు"
# ఏర్పాటుకు కీలక అడుగులు

- **సీతంపేట, సుజాతనగర్‌లే అనుకూల ప్రాంతాలుగా గుర్తింపు**
- **కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడుకు నివేదిక పంపిన మంత్రి తుమ్మల**
- **667 ఎకరాల్లో నిర్మాణానికి అవకాశం**
- **ఆరు ప్రాంతాల్లో సాధ్యాసాధ్యాల అధ్యయనం**



**భద్రాద్రి బ్యూరో, మహా**:దశాబ్దాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు ఎదురుచూస్తున్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం కల సాకారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఇప్పటికే ప్రతిపాదించిన స్థలాలు సాంకేతిక, ఆర్థిక కారణాలతో అనుకూలం కాదని తేలడంతో జిల్లా యంత్రాంగం ద్వారా ప్రత్యామ్నాయ స్థలాలపై చేపట్టిన సమగ్ర సాధ్యాసాధ్యాల అధ్యయన నివేదికను వ్యవసాయ మార్కెటింగ్ సహకార చేనేతజౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రాంమోహన్ నాయుడుకు అందజేశారు. ఈ మేరకు మంత్రి శనివారం లేఖ రాశారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై గతంలో తాను పంపిన లేఖలను ప్రస్తావిస్తూ, తాజా పరిణామాలను ఇందులో వివరించారు.

**రెండు పాత ప్రతిపాదనలకు అడ్డంకులు**

కొత్తగూడెం సమీపంలో గతంలో ప్రతిపాదించిన రెండు స్థలాల్లో ఒకటి సాంకేతికంగా మరొకటి ఆర్థికంగా (భూసేకరణకు) అనుకూలం కాదని తేలడంతో ప్రాజెక్టు ముందుకు సాగలేదు. దీంతో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సూచన మేరకు జిల్లా యంత్రాంగం స్వతంత్ర సాంకేతిక సంస్థ 'రాజ్ టెక్నాలజీస్'ను రంగంలోకి దించి సాంకేతికంగా ఆర్థికంగా అనుకూలమైన కొత్త స్థలాలను గుర్తించే బాధ్యతను అప్పగించింది. ఇటీవల ఢిల్లీలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర మంత్రిని కలిసినప్పుడు కొత్త స్థల ప్రతిపాదనపై పది రోజుల్లో ఫీజిబిలిటీ నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ మేరకు నిర్దేశిత గడువులోగానే నివేదికను సిద్ధం చేసి కేంద్రానికి పంపడం గమనార్హం.

**ఆరు ప్రాంతాల పరిశీలన...**

ఏటీఆర్ 72600 తరహా విమానాలకు అనుగుణంగా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో భూమి లభ్యత, భూతల స్వరూపం, రన్‌వే దిశ, ఎత్తు పరిమితి ఉపరితలాలు (అబ్‌స్టకల్ లిమిటేషన్ సర్ఫేసెస్), పర్యావరణ అంశాలు రవాణా సౌకర్యాలను నిపుణుల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ ప్రాథమిక సాధ్యాసాధ్యాల అధ్యయనంలో సీతంపేట, సుజాతనగర్ ప్రాంతాలు అవసరమైన కీలక సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా అనుకూలమైన భూతలం భూవినియోగం నిర్వహణ పరిస్థితులతో ఉన్నట్లు తేలింది. సుమారు 667 ఎకరాల ప్రతిపాదిత అభివృద్ధి స్థలాన్ని ఎలాంటి ప్రధాన పర్యావరణ, సాంకేతిక అవరోధాలు లేకుండానే సమకూర్చవచ్చని నివేదిక స్పష్టం చేసింది. దీంతో ఏళ్లుగా నానుతున్న స్థల నిర్ధారణ సమస్యకు తెరపడే అవకాశం కనిపిస్తోంది.

**జిల్లా ప్రాధాన్యతను వివరించిన మంత్రి...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యూహాత్మక ప్రాంతంలో ఉండటమే కాక విశాలమైన గిరిజన పారిశ్రామిక పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోందని మంత్రి తుమ్మల తన లేఖలో పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు గనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ, బీపీఎల్ వంటి ప్రముఖ పారిశ్రామిక సంస్థలకు ఈ జిల్లా నిలయంగా ఉందని వివరించారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి క్షేత్రానికి ఏటా లక్షలాది మంది భక్తులు దేశ విదేశాల నుంచి తరలివస్తుంటారని గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వారి ప్రయాణం మరింత సులభతరమవుతుందని తెలిపారు. అంతేకాక జిల్లాలోని అటవీ సంపద, ఖనిజ వనరులు, ఎకో టూరిజం అవకాశాలు, ప్రతిపాదిత ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులకు విమానాశ్రయం మరింత బలం చేకూరుస్తుందని తద్వారా పెట్టుబడులు పెరిగి విద్యా పారిశ్రామిక పర్యాటక రంగాల్లో వేగవంతమైన అభివృద్ధికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు.

**సంపూర్ణ సహకారం అందిస్తామన్న మంత్రి...**

ఫీజిబిలిటీ నివేదికను దయచేసి పరిగణనలోకి తీసుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రిని తుమ్మల తన లేఖలో అభ్యర్థించారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని విధాలుగా సంపూర్ణ సహకారం అందిస్తాయని హామీ ఇచ్చారు. ఫీజిబిలిటీ అధ్యయన నివేదిక ప్రతిని కూడా లేఖతో పాటు కేంద్ర మంత్రికి జతచేసినట్లు తెలిపారు.

**త్వరలో వాస్తవరూపం దాల్చనున్న చిరకాల స్వప్నం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లావాసుల దశాబ్దాల కల అయిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, తాజా పరిణామాలతో సాకారానికి మరింత చేరువైందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కేంద్రం నుంచి తుది ఆమోదం లభిస్తే గిరిజన పారిశ్రామిక పుణ్యక్షేత్ర ప్రాధాన్యత కలిగిన ఈ జిల్లాకు గగనతల అనుసంధానం ఏర్పడి ప్రాంతీయ ఆర్థిక ముఖచిత్రమే మారిపోనుందని పరిశీలకులు పేర్కొంటున్నారు.



# మలేరియా రహిత... సమాజాన్ని నిర్మించడమే లక్ష్యం

- ఇంటి ఆవరణ పరిశుభ్రతే.... దోమల నివారణకు ఉత్తమ మార్గం.
- కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం.

**కుషాయిగూడ, మహా** : మలేరియా రహిత సమాజాన్ని నిర్మించడమే ప్రధమ లక్ష్యమని, ఇంటి ఆవరణ పరిశుభ్రతే దోమల నివారణకు ఉత్తమ మార్గమని కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం పేర్కొన్నారు. శనివారం ఎంటమాలజి విభాగం పర్యవేక్షణలో కీసర సర్కిల్ చంద్రపురి కాలనీ డివిజన్ చెన్నాపురం చెరువులో దోమల నివారణకు దోమల లార్వా నివారణ డ్రోన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజదరైన రామలింగం మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ప్రజలు వర్షాకాలం దృష్ట్యా మలేరియా, కలరా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అత్యంత జాగ్రత్తగా ఉండాలని, సర్కిల్ పరిధిలో మలేరియా వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండి మలేరియా రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. దోమల నివారణకు ఇంటి ఆవరణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ చెత్త తదితర పదార్థాలను దూరంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా మన చుట్టు పక్కల ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి మన ప్రాంతాలలో ఉన్న దోమలను అరికట్టవచ్చని ఇంటి ఆవరన పరిశుభ్రతే దోమల నివారణకు ఉత్తమ మార్గం అన్నారు. దోమల నిర్మూలన ప్రతి పౌరుని బాధ్యత అని మలేరియా డెంగ్యూ వ్యాధులను వ్యాప్తి చేసే దోమలు మీ ఇంటి ఆవరణ పరిసరాలలో ఉండే నీటి తొట్లలో ఉంటాయన్నారు. అనంతరం చంద్రపురి కాలనీ డివిజన్ లోని చెన్నాపురం చెరువులో డ్రోన్ స్ప్రేయింగ్ పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ కార్యక్రమంలో డి ఈ సంతోష్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ భాస్కర్, తిరుపతి, రాజు, వార్డ్ ఎంటమాలజీ సూపర్ వైజర్లు శ్రీనివాస్, ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అల్లూరి త్యాగం మార్గదర్శకం కావాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా** : భారతదేశం గర్వించే విప్లవోద్యమ నేత బ్రిటిష్ వలసవాదులను గడగడ లాడించాడని అల్లూరి సీతారామరాజు త్యాగం నేటి రేపటి భవిష్యత్తు తరాలకు మార్గదర్శకమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మీర్ పేట హౌసింగ్ బోర్డ్ కాలనీలో అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా మెయిన్ రోడ్డులో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అల్లూరి దేశ స్వాతంత్ర్య సమరంలో చేసిన త్యాగాలు, సాహసాలను ప్రజలు మర్చిపోలేరని పీడిత, తాడిత, పేద ప్రజలు ఉన్నంత వరకు అల్లూరి సీతారామరాజు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులని కొనియాడారు. అల్లూరి సీతారామరాజుతో పాటు భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్, జతిందాస్ చంద్రశేఖర్ ఆజాద్ వంటి స్వాతంత్రం కోసం తమ రక్తాన్ని చిందించారని, వారి త్యాగం వృధా కాదని మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు అన్నారు, అల్లూరి స్ఫూర్తిని రగిలించాల్సిన అవసరం ఉందని మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య అన్నారు, అల్లూరి వారసులు వెల్లువై తీరాలి, భగత్ సింగ్ కలలు నిజమై తీరాలి, ఈ దేశపు సంకెళ్లు తెంచయ్య స్వేచ్ఛ కోసం మరో పోరాటం రావాల్సి ఉందని మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, జేరిపోతుల ప్రభుదాస్ అన్నారు, కార్యక్రమంలో బీజేవైఎం మహిళా మోర్చా హౌసింగ్ బోర్డ్ డివిజన్ అధ్యక్షురాలు భాగవతుల శశికళ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం అంజయ్య, బిజెపి నేతలు రామ్ ప్రదీప్, ఆయా కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

- తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మొయినాబాద్ మండల అధ్యక్షుడు తుకారాం

**మొయినాబాద్ మహా**: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మొయినాబాద్ మండల అధ్యక్షుడు తుకారాం తెలిపారు. శనివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం మొయినాబాద్ మండల తహసీల్దార్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రాన్ని ఆ సంఘం నేతలు అందించారు. అనంతరం తుకారాం మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులకు అతి త్వరలో పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్న డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న తదితర అంశాలపై ఈరోజు రాష్ట్రంలోని అన్ని మండలాలలో ముఖ్యమంత్రి తహసీల్దార్ల ద్వారా వినతి పత్రం సమర్పించడం జరిగిందని మొయినాబాద్ లో ఈ రోజు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మొయినాబాద్ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, రంగారెడ్డి జిల్లా కోశాధికారి దూత కృష్ణ, మండల గౌరవ అధ్యక్షులు అబ్బయ్య,మండల కోశాధికారి వినోద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జోసెఫ్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**యాదాద్రి భువనగిరి జూలై 4 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామ శివారులో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్మాణ పనులకు శనివారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు ప్లాస్టిక్ వ్యర్థాల సక్రమ నిర్వహణ ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటుతో పాటు గ్రామాల్లో పరిశుభ్రత మరింత మెరుగుపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీబీనగర్ మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

# కబ్జాల్లో చిక్కుకున్న చారిత్రక ఫిరంగి నాలా

- గొలుసుకట్టు చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి: బక్కని నరసింహులు



**రాజేంద్రనగర్, మహా**: నిజాం కాలంలో నిర్మించిన చారిత్రక ఫిరంగి నాలా (ఫిరంగి కాలువ)ను ఆక్రమణల నుంచి రక్షించి పునరుద్ధరించాలని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు ప్రభుత్వాన్ని కోరారు. శంషాబాద్ మండలంలోని చౌదర్‌గూడ, నర్కూడ గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న ఫిరంగి నాలాను శనివారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ఒకప్పుడు నాలుగు నియోజకవర్గాల్లోని సుమారు 45 గొలుసుకట్టు చెరువులకు సాగు, తాగునీటిని అందించిన ఈ చారిత్రక కాలువ ప్రస్తుతం రియల్ ఎస్టేట్ కబ్జాలు, అక్రమ నిర్మాణాలు, కాలుష్యంతో కనుమరుగయ్యే పరిస్థితికి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. 1872లో నిర్మించిన ఈ ఫిరంగి నాలా షాబాద్ మండలం చందన్‌వల్లి నుంచి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వరకు సుమారు 85 కిలోమీటర్ల మేర విస్తరించి, 81 తూములు, కల్వర్టులతో అద్భుత ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిందన్నారు. శంషాబాద్ విమానాశ్రయం పరిసరాలు, ఆదిభట్ల, రావిర్యాల, మంగళ్‌పల్లి ప్రాంతాల్లో భారీగా అక్రమ లేఅవుట్లు ఏర్పడడంతో ఒకప్పుడు 70 అడుగుల వెడల్పు ఉన్న నాలా కొన్ని ప్రాంతాల్లో 15 నుంచి 18 అడుగులకు కుదించుకుపోయిందన్నారు. స్వచ్ఛమైన నీరు ప్రవహించాల్సిన కాలువలో ప్రస్తుతం పరిశ్రమల వ్యర్థాలు, మురుగునీరు, ప్లాస్టిక్ చెత్త చేరి మురుగు కాలువగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఫిరంగి నాలా పూడికలను తొలగించకపోవడంతో అది పూర్తిగా పూడిపోవడమే కాక ఆక్రమణలకు గురవుతోందన్నారు. దీంతో ప్రతి వర్షాకాలంలో శంషాబాద్‌తో పాటు పరిసర లోతట్టు ప్రాంతాలు తరచూ జలమయం అవుతున్నాయని తెలిపారు. 111 జీవో అమల్లో ఉన్న ప్రాంతాల్లో కూడా అనుమతుల పేరుతో అక్రమ వెంచర్లు, నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు నీటి వనరులను పరిరక్షించాలంటే ఫిరంగి నాలాను వెంటనే ఆక్రమణల నుంచి విముక్తి చేసి పునరుద్ధరణ పనులు చేపట్టాలని బక్కని నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేంజర్ల సురేష్, పులిజాల చంద్రశేఖర్, మద్దెల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



# ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వ్యసనంతో మహిళ కిడ్నాప్.. దోపిడీ, హత్యాయత్నం

- సాంకేతిక ఆధారాలతో నిందితుడి అరెస్ట్

**కరీంనగర్ మహా**: ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌లో భారీగా డబ్బు నష్టపోయి అప్పుల ఒత్తిడితో ఓ మహిళను కిడ్నాప్ చేసి, దోపిడీ చేసి, బావిలోకి తోసి హత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 1న టవర్ సర్కిల్ లేబర్ అడ్డా వద్ద కూలీ పనికి వేచి ఉన్న గంగాధర లక్ష్మి (55) అదృశ్యమయ్యారు. దర్యాప్తులో గొల్లపల్లి గ్రామానికి చెందిన ధమ్మ దినేష్ రెడ్డి (21) ఈ నేరానికి పాల్పడినట్లు తేలింది. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌లో రూ.4 లక్షల వరకు నష్టపోయిన నిందితుడు, లోన్ యాప్‌ల అప్పుల ఒత్తిడితో డబ్బు కోసం ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు బాధితురాలిని తిమ్మాపూర్ సమీపంలోని నుస్తులాపూర్ శివారుకు తీసుకెళ్లి బంగారు, వెండి ఆభరణాలు దోచుకుని, అనంతరం బావిలోకి తోసివేశాడు. అయితే బాధితురాలు ధైర్యంగా ప్రాణాలు కాపాడుకోగా, మరుసటి రోజు రైతులు ఆమెను రక్షించి ఆసుపత్రికి తరలించారు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ విశ్లేషణతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు అతని వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన బైక్, మొబైల్ ఫోన్లు, నగదు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. విక్రయించిన బంగారు ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ యువతను ఆర్థికంగా, మానసికంగా దెబ్బతీసి నేరాలకు దారి తీస్తోందని పోలీసులు హెచ్చరిస్తూ, ప్రజలు ఇటువంటి యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే కూలీలు అపరిచితులను నమ్మి ఒంటరిగా వెళ్లవద్దని పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# అడ్మీషన్ల పెంపుకై కృషి చేయాలి

- డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్
- కళాశాలలకు ఆన్ లైన్ సూచనలు

**మహా వరంగల్ ఎడ్యుకేషన్:** వరంగల్ జిల్లాలో ఇంటర్ అడ్మీషన్ల పెంపుకు కళాశాలల ప్రిన్సిపాళ్లు , అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి డాక్టర్ . శ్రీధర్ సుమన్ ఆదేశించారు. శనివారం ఇంటర్ విద్య కార్యాలయం నుండి అడ్మీషన్ల పెంపు, మారిన సిలబస్ తదితర అంశాల పై కళాశాలలకు వీసి ద్వారా కీలక సూచనలు చేశారు. ఇంటర్ కమీషనర్ ఆదేశాల మేరకు గత సంవత్సరం కన్నా మెరుగైన అడ్మీషన్ల లక్ష్యాలను చేరుకోవడానికి రోజువారీ అడ్మీషన్ల పెంపు పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాలిటెక్నిక్, వెల్ఫేర్ కళాశాలల అడ్మీషన్ల ప్రక్రియ ముగిసినందున ఇంటర్మీడియేట్ లో జాయిన్ కాని విద్యార్థుల ఇంటి వద్దనే ఆన్ లైన్ లో అడ్మీషన్ నమోదు చేయాలని, కళాశాలల్లో సంబంధిత పత్రాలు సమర్పించగానే యూ_డైస్ తదితర వెబ్ సైట్లలో విద్యార్థి వివరాలు పొందుపర్చాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్ధారిత లక్ష్యం 1311 కు గాను శనివారం నాటికి 904 మంది విద్యార్థులు చేరి ఉన్నారని పేర్కొన్నారు. అలాగే మరో రెండు వారాల్లో 400 అడ్మీషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మరో భూ పోరాటానికి రైతాంగం సిద్ధం కావాలి

- తెలంగాణ రైతు సంఘం పిలుపు
- ఘనంగా దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి వేడుకలు



**మహా వరంగల్ బ్యూరో;** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా రైతాంగం మరో భూ పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడ్డి శ్రీనివాస్, రైతు సంఘ నాయకుడు మాచర్ల బాలరాజు పిలుపునిచ్చారు. వరంగల్ నగరంలోని చింతల్ ప్రైవేట్ బ్రిడ్జి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనలో భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా భూమిలేని పేదలకు భూమి దక్కాలనే లక్ష్యంతో సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొడ్డి కొమరయ్య తన ప్రాణాలను అర్పించి అమరుడయ్యారని పేర్కొన్నారు. దొడ్డి కొమరయ్య త్యాగం తెలంగాణ రైతాంగ పోరాటానికి నూతన స్ఫూర్తినిచ్చిందని, ఆయన అమరత్వం అనంతరం వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఉద్యమంలో భాగస్వాములై భూస్వాముల ఆధీనంలో ఉన్న వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని భూమిలేని పేదలకు పంపిణీ చేసుకున్న చారిత్రక పోరాటాన్ని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా భూమిలేని పేదల సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని, సాగు చేస్తున్న భూములపై రైతులకు హక్కులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ, బంజరు, దేవాదాయ, వక్ఫ్ మరియు ఇతర ప్రజా భూములను గుర్తించి నిజమైన అర్హులైన భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలను అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధరలు, సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, రుణ సౌకర్యాలు అందించాలని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దొడ్డి కొమరయ్య ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొంటూ, భూమి, భుక్తి, విముక్తి లక్ష్యాల సాధన కోసం రైతులు, వ్యవసాయ కార్మికు ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అవసరమైతే మరో భూ పోరాటాన్ని నిర్మించి భూమిలేని పేదలకు భూమి సాధించుకునే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసం

# దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాట వీరుడు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాట వీరుడని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని ఆయన కీర్తించారు. ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చైతన్యపరిచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారని వివరించారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం యువతకు మార్గదర్శకమని వెల్లడించారు. దేశ స్వాతంత్రం, ప్రజల సంక్షేమం కోసం విరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ వర్ధంతి ఉత్సవాలకు వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల ప్రతినిధులు హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతిని వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటే శక్తివంతమైంది

**మాజీ కార్పొరేటర్ జిట్టా శ్రీవాణి. శ్రీనివాస్ రెడ్డి**

**కుషాయిగూడ, మహా :** ప్రజాస్వామ్యంలో ఓటే శక్తివంతమైందని అర్హులైన ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేసుకోవాలని జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ జిట్టా శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను పురస్కరించుకొని మాజీ కార్పొరేటర్ జిట్టా శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చంద్రపురి డివిజన్ బూత్ నెంబర్ 560, 562, 564 లలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిట్టా శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ నమోదులో బిఆర్ఎస్ కార్యకర్తలు పకడ్బందీగా పని చేస్తున్నారని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ మైనింగ్ కేసు నమోదు

**రాజేంద్రనగర్, మహా:** మల్కారం గ్రామ సర్పంచ్ కొత్త బిక్షపతి రెడ్డిపై అక్రమ ఇసుక తవ్వకాల ఆరోపణలతో శంషాబాద్ పోలీసులు ఎంఎండీఆర్ చట్టం సెక్షన్ 21 కింద కేసు నమోదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఈసీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించి నిల్వ ఉంచినట్లు రెవెన్యూ అధికారుల ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణకు వెళ్లిన అధికారులతో దురుసుగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

**కుషాయిగూడ, మహా :** కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన వివరాల మేరకు మజ్జూరి రేఖ (21) భర్త సాయికిరణ్ (ఎక్సైజ్ కానిస్టేబుల్) శాంతినగర్ లో నివాసముంటున్నారు. వీరికి ఒక సంవత్సరం వయసు గల కుమారుడు ఉన్నారు. ఈనెల మూడవ తేదీన మధ్యాహ్నం సుమారు నాలుగు గంటల సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరు లేని సమయంలో రేఖ ఇంటి బెడ్ రూమ్ లో సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అనంతరం ఆమె అత్త ఇంటికి వచ్చి చూడగా రేఖ ఉరి వేసుకున్న స్థితిలో కనిపించింది. వెంటనే ఆమె స్థానికులకు సమాచారం అందించగా రేఖను అక్కడ నుంచి కిందికి దింపి చూడగా చనిపోయిన స్థితిలో ఉన్నది. రేఖ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# దొడ్డి కొమురయ్య వర్ధంతి

**నిర్మల్ మహా :** నైజాం కాలంలో తెలంగాణ ప్రజలను బానిసత్వపు సంకెళ్ళ నుంచి బంధవిముక్తి చేసేందుకు తెలంగాణ యోధుడు దొడ్డి కొమురయ్య పోరాటాలు చేశారని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ గుర్తు చేశారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో శనివారం ఉదయం దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంతో తెగువతో నిజాం నిరంకుశత్వాన్ని, దొరల ఆగడాలపై వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. ఇలాంటి మహనీయుల జయంతి, వర్ధంతుల కార్యక్రమాలు ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని తెలిపారు. దొడ్డి కొమురయ్య ఆశయాలను అందరూ కొనసాగించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ బిసి సంక్షేమ అధికారి సత్యనారాయణ, పలువురు సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# కళ్యాణ వేడుకల్లో కంది శ్రీనన్న

**ఆదిలాబాద్ మహా** : అభిమానంతో ఆహ్వానించిన వారి వేడుకలకు హాజరవుతారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని గాయత్రీ గార్డెన్ లో జరిగిన అర్గుల పద్మ నర్సారెడ్డి దంపతుల కుమారుడు శైలేష్ రెడ్డి , రజిత ల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి పెళ్లి కానుకలను బహుకరించారు. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,కౌన్సిలర్ చరణ్ గౌడ్,భోరజ్ మండల్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ బత్తుల శ్రీనివాస్, నాయకులు రాజా రెడ్డి, బోనగిరి సంటెన్న, దర్శనాల అశోక్ తదితరులున్నారు..



# మహిళలకు స్వయం ఉపాధి ఎంతగానో మేలు చేస్తుంది

- **మహిళలు చైతన్య స్ఫూర్తి కనబరిచి నిరక్షరాస్యతను రూపు మాపాలి**
- **రాష్ట్ర వయోజన విద్యాశాఖ సంచాలకులు ఏ శ్రీనివాసరెడ్డి వెల్లడి**

**మందమర్రి, మహా** :మహిళలకు స్వయం ఉపాధి భవిష్యత్తులో ఎంతగానో మేలు చేస్తుందని రాష్ట్ర వయోజన విద్యాశాఖ సంచాలకులు ఏ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శనివారం మందమర్రి సింగరేణి సిఈఆర్ క్లబ్ లో వయోజన విద్యాశాఖ జిల్లా లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖి వారి సహకారంతో 100 రోజులలో కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు కుట్టు శిక్షణ నైపుణ్యాలను శ్రద్ధగా నేర్చుకుని ఆర్థికంగా ఎదగాలని ఆయన అన్నారు. మహిళలు చదువు పట్ల నిర్లక్ష్యం చేయరాదని మధ్యలో మానేసిన చదువుకునేందుకు ఓపెన్ 10వ తరగతి, ఓపెన్ ఇంటర్ ఓపెన్ డిగ్రీ లు పూర్తి చేసేందుకు ప్రయత్నించాలని వివరించారు. చదువుకున్న మహిళలు చదువురాని వారికి స్వచ్ఛందంగా విద్యను నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. అనంతరం వయోజన విద్యాశాఖ నిజామాబాద్ జిల్లా డైరెక్టర్ పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో జిల్లా కలెక్టర్, అధికారుల సహకారంతో ఈ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ప్రాజెక్టు ఆఫీసర్ ఎం శ్రీనివాస్,సఖి క్లబ్ అడ్మినిస్ట్రేటర్, డిఆర్పి బండ శాంకరి, సుమన్ లు అధ్యక్షత వహించగా కుట్టు శిక్షణ కేంద్రం కో ఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక, ఆర్గనైజర్ ఉప్పులేటి నరేష్, శిక్షకురాలు ఉప్పులేటి శారద తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ సమీక్షా సమావేశం

**ఆదిలాబాద్ మహా** :వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏవైనా సమస్యలుంటే వెంటనే తెలియ చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ సంబంధిత శాఖల సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వన్‌టౌన్ , టూ టౌన్ లలో ప్రత్యేక అధికారులతో బృందాలను నియమించినట్లు తెలిపారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే స్వీకరించి పరిష్కరించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 9000018842 కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.భారీ వర్షాలు కురిసే సమయంలో వార్డు అధికారులు, శానిటరీ జవాన్లు, వాటర్ సెక్షన్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, ప్రత్యేక అధికారులు అందరూ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, అవసరమైన యంత్రాంగం, ముఖ్యంగా జేసీబీలు సిద్ధంగా ఉంచాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని 49 వార్డుల్లో సుమారు 9నుంచి 12 వార్డులు లోతట్టు ప్రాంతాలుగా ఉన్నందున, భారీ వర్షాల సమయంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాల్వలు, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడంతో పాటు, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేసి, ప్రతి సమస్యకు వెంటనే స్పందించాలని మ అధికారులను ఆదేశించారు.ప్రజలు తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీజనల్ వ్యాధులు డెంగ్యూ , మలేరియా ప్రభలుతున్న సందర్భంలో అందరు అప్రమత్తంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఆర్‌ఓ కల్యాణ్, టీపీఓ సుమలత, టౌన్ ప్లానింగ్ అధికారులు, శానిటేషన్ జవాన్లు, వార్డు అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హిమాయత్ నగర్ ఇళ్లస్థలాల బాధితులకు వెంటనే న్యాయం చేయాలి...

- **చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం**
- **హిమాయత్ నగర్ మాజీ సర్పంచ్ మల్లేష్ యాదవ్**

**హిమాయత్ నగర్** 60 గజాల ఇళ్లస్థలాల బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని భరోసామొయినాబాద్ మహా:హిమాయత్ నగర్ 60గజాల ఇళ్ల స్థలాల బాధితులకు న్యాయం జరిగేంతవరకు బీజేపీ పార్టీ అండగా ఉంటుందని చేవెళ్ళ మాజీ ఎమ్మెల్యే రత్నం తెలిపారు. గత తొమ్మిది రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న హిమాయత్ నగర్ గ్రామస్థులకు శనివారం బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రత్నం మాట్లాడుతూ హిమాయత్ నగర్ గ్రామస్థులకు న్యాయం జరిగేంతవరకు బీజేపీ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. 60గజాల ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం దారుణమని చెప్పారు. గతంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య ఇక్కడ ఇళ్ల స్థలాల కోసం శిలాఫలకం ప్రారంభించిన విషయాన్ని మరిచిపోయాడని విమర్శించారు. గ్రామస్తులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని వారికి బీజేపీ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని చెప్పారు. నాలుగు యువజన సంఘాల నాయకులు ఈ ఉద్యమంలో పాల్గొనడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు మాదాపురం శ్రీకాంత్, ప్రభాకర్ రెడ్డి, మోర నరసింహారెడ్డి. మాధవరెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ షాబాద్ కిషన్, బాత్కు ప్రభాకర్ యాదవ్, జల్లెల రవి యాదవ్, ఆయా యువజన సంఘాల అధ్యక్షులు కుమ్మరి విఠల్, కట్ట మీది శ్రీను, కరీం, గోపాల్ నాయక్ హిమాయత్ నగర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఒక్కసారి కేసు నమోదైతే భవిష్యత్తు ఇబ్బందికరం: సీపీ తరుణ్ జోషి



**మొయినాబాద్, మహా:** ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్స్, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ లలో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఎలాంటి అవకాశం ఇవ్వొద్దని, ఒకసారి కేసు నమోదైతే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ హెచ్చరించారు.మొయినాబాద్‌లోని వుడ్‌ల్యాండ్స్ రిసార్ట్స్‌లో చేవెళ్ల జోన్ పరిధిలోని మొయినాబాద్, శంషాబాద్, చేవెళ్ల, షాబాద్ ప్రాంతాలకు చెందిన 750కు పైగా ఫామ్‌హౌస్‌లు, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌ల యజమానులు, నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి ఫామ్‌హౌస్‌లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి కనీసం 30 రోజుల ఫుటేజ్‌ను భద్రపరచాలని, ప్రతి అతిథి వివరాలు, ప్రభుత్వ గుర్తింపు కార్డు నమోదు తప్పనిసరి అని సూచించారు. అతిథుల వివరాల నమోదుకు "సేఫ్ అతిథి" యాప్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు లేదా సంరక్షకులు లేకుండా మైనర్లకు ప్రవేశం కల్పించరాదని, అన్ని కార్యక్రమాలకు ముందుగానే చట్టబద్ధ అనుమతులు తీసుకోవాలని చెప్పారు. రేవ్ పార్టీలు, డ్రగ్స్, హుక్కా పార్టీలు, జూదం, మానవ అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్స్‌లో ఈగిల్ ఫోర్స్, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, స్థానిక పోలీసులు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీసీపీ యోగేష్ గౌతమ్, ఏసీపీ బి. కిషన్ గౌడ్, పలువురు సీఐలు, పోలీసు అధికారులు, ఫామ్‌హౌస్ యజమానులు పాల్గొన్నారు.

# మంచాల మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే రంగారెడ్డి...

- **వెనుకబడిన ప్రాంతం అనే ముద్రను చెరిపేసేలా అభివృద్ధి...**
- **కొర్రవానితాండాలో రైతుగా మారి, నాట్లు వేసిన ఎమ్మెల్యే రంగారెడ్డి**



**ఇబ్రహీంపట్నం జూలై 4 మహా**: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతు సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. వెనుకబడిన మండలంగా పిలువబడుతున్న మంచాలకు మహర్దశ చేకూరేలా యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే నోములలో సీసీ రోడ్లు, ఎరువుల పంపిణీ కేంద్రం ప్రారంభించారు. గ్రామపంచాయతీ సిబ్బందికి 12,000 రూపాయల వేతనం ప్రతినెల ఒకటో తారీకు అందించాలని గ్రామ కార్యదర్శికి ఎమ్మెల్యే ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామపంచాయతీ కార్మికులకు కనీసం 12 వేల రూపాయలు వేతనం చెల్లించాలని ఆయన మండల పరిషత్ అధికారినికి ఆదేశించారు. అనంతరం, మండల పరిషత్ కార్యాలయానికి వెళ్ళిన ఎమ్మెల్యే... ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గిరిజన రైతులకు మంజూరు చేసిన బోరు మోటార్లను పంపిణీ చేశారు. అక్కడి నుంచి ఆరుట్ల గ్రామానికి వెళ్లిన మల్ రెడ్డి సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అలాగే పీఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

**రంగాపూర్ లో ఉపాధ్యాయుడిగా మారిన ఎమ్మెల్యే మల్ రెడ్డి....**

రంగాపూర్ మినీగురుకులంలో తరగతి గదుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పాఠశాలకు కావాల్సిన సదుపాయాల గురించి ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్కూల్ పిల్లల మధ్య తిరుగుతూ, వారితో ముచ్చటిస్తూ కాసేపు టీచర్ గా మారారు. ఎమ్మెల్యే ప్రశ్నలకు పిల్లలు ఉత్సాహంగా సమాధానాలు ఇచ్చారు. విద్యార్థులకు బిస్కెట్లు పంచుతూ మురిపించారు. ఇలా దాదాపు గంటపాటు మల్ రెడ్డి రంగారెడ్డి గారు బడి పిల్లలతో సరదాగా గడుపుతూ సందడి చేశారు. అనంతరం, ఎల్లమ్మతాండలో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గ్రామానికి వచ్చిన మల్ రెడ్డి రంగారెడ్డికి స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గ్రామానికి వచ్చిన నిధుల పట్టికను ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శిని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందించారు. ఇదే మాదిరిగా అన్ని గ్రామాలు అనుసరించాలని సూచించారు. అక్కడి నుంచి బోడకొండ గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యేకు... గ్రామస్థులు డప్పులతో స్వాగతం పలికారు. బోడకొండలో ఏర్పాటు చేసిన వ్యవసాయ రైతు సేవా కేంద్రాన్ని మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. అంబోతుతండాలో రోడ్డు పక్కన నిల్చున్న ఓ వృద్ధుడిని గుర్తించి కారు దిగిన ఎమ్మెల్యే.... దశబ్దాల క్రితం ఆయనతో తనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆప్యాయంగా అలింగనం చేసుకున్నారు. లోయపల్లి గ్రామంలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీకి శంకుస్థాపన చేశారు. లోయపల్లిలో గ్రామస్థులు ఇచ్చిన పలు విజ్ఞాపనలను ఎమ్మెల్యే స్వీకరించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, కరెంటు కోతలపై, ఇతర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.

**మంచాల మెచ్చేలా అభివృద్ధి...**

ఇన్నాళ్లు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన వారు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచి, మంచాల మండలం అంటే వెనకబడిన ప్రాంతంగా పేరు మార్చారని, గత రెండున్నరేళ్లలో రికార్డు స్థాయిలో నిధులు ఇక్కడి గ్రామాలకు మంజూరు చేసినట్టు చెప్పారు. నియోజకవర్గ ప్రగతి యజ్ఞంలో భాగంగా మంచాల మండల రూపురేఖలు మార్చటమే తన లక్ష్యమన్నారు. ఈ క్రతువులో రాజకీయాలకతీతంగా నాయకులు, ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

**కరిగట్టులో కర్షకులతో రంగన్న...**


మంచాల మండలంలో పర్యటించే క్రమంలో మార్గమధ్యలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కాసేపు రైతుగా మారారు. కొర్రవాని తాండాలో వరినాట్లు వేస్తున్న రైతులు, కూలీల వద్దకు వెళ్ళారు. స్వయంగా నారుమడిలోకి దిగి, నాట్లు వేశారు. సాగు స్థితిగతులను తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పథకాల అమలు, అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా ఖాతాల్లో జమ అయిందా అని అడగ్గా... వాటితోనే సాగు ప్రారంభించినట్లు రైతులు చెప్పారు. గత సీజన్లో పంట కొనుగోలు, సన్నాలకు బోనస్, రైతు బీమా, ఉచిత కరెంటు, రుణమాఫీ, విత్తనాలు, ఎరువుల తదితర అంశాల గురించి నారుమడిలోనే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతు సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రంగారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏఎంసీ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి పిఏసిఎస్ చైర్మన్లు ఏదుల పాండురంగారెడ్డి, వేదిరే హనుమంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసిపి కెపివి రాజు, సిఐ మధు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసీ శేఖర్ గౌడ్, కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మంకాల దాసు ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి నాయకులు చీమల జంగయ్య, రమాకాంత్ రెడ్డి, భరత్ రెడ్డి, జయపాల్ రెడ్డి వాళ్లు శాఖల అధికారులు, ప్రజలు రైతులు పాల్గొన్నారు.

# బునాదిగాని కాలువ బాక్స్ కల్వర్టు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి జూలై 4 మహా**

భువనగిరి నియోజకవర్గం బీబీనగర్ మండలం మక్త అనంతారం గ్రామ సమీపంలోని బునాదిగాని కాలువపై కొనసాగుతున్న బాక్స్ కల్వర్టు నిర్మాణ పనులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, నిర్మాణ నాణ్యతపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బునాదిగాని కాలువ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. కాలువ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ (ల్యాండ్ అక్విజిషన్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని, భూసేకరణ పూర్తయిన వెంటనే మిగిలిన నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న బాక్స్ కల్వర్టు నిర్మాణ పనులను ఆగస్టు 10వ తేదీలోగా పూర్తి చేసి కాలువ ద్వారా నీటిని విడుదల చేయడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలను సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనుల్లో మరింత వేగం పెంచాలని అధికారులకు సూచించిన ఎమ్మెల్యే, నిర్మాణ పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. పనుల కారణంగా ప్రజలు, రైతులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు, పనులు పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో సాగునీటి వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, సాగునీటి అందుబాటును మెరుగుపరిచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత, సమయపాలనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# స్నేహితుడి కారు తీసుకెళ్లి యువకుడి మృతి

**రాజేంద్రనగర్, మహా:** స్నేహితుడికి చెప్పకుండా కారు తీసుకెళ్లిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డుపై చోటు చేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం, కరీంనగర్‌కు చెందిన బైరెడ్డి సంపత్ రెడ్డి (21) సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతూ పటాన్‌చెరువులో హాస్టల్‌లో నివసిస్తున్నాడు. హాస్టల్‌లో తనతో ఉన్న స్నేహితుడు సాయిరెడ్డికి చెందిన కారును చెప్పకుండా తీసుకెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున ఔటర్ రింగ్ రోడ్డుపై వేగంగా వెళ్తుండగా ముందున్న రెడీమిక్స్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టడంతో సంపత్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దేవాలయ భూమిలో అక్రమ నిర్మాణాలకు నోటీసులు

**రాజేంద్రనగర్, మహా:** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై దేవాదాయ శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఆలయానికి చెందిన సర్వే నంబర్లు 72 నుంచి 77 వరకు ఉన్న భూమిలో నిర్మాణాలు జరుగుతున్నట్లు గుర్తించి, ఈవో శ్రీకాంత్ ఆధ్వర్యంలో అధికారులు నోటీసులు అతికించి పనులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. భూమిపై చట్టబద్ధమైన యాజమాన్య పత్రాలు సమర్పించకపోతే దేవాదాయ చట్టం 30/87 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**ఇబ్రహీంపట్నం జూలై 4 మహా**: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరంలాంటిదని, దీనిప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోటె శ్రీశైలం అన్నారు. శనివారం మండల పరిధిలో అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన కొప్పు రామకృష్ణకు, ఎమ్మెల్యే మల్ రెడ్డి సహకారంతో ₹32,000/ చెక్కును, కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు నక్క లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నక్క మహేందర్, కొప్పు వెంకటస్వామి, నాయకులు చీర శేఖర్, సామ రాములు, మల్లయ్య, నక్క పండరి, వార్డు సభ్యులు నక్క కలమ్మ, నందు, అంజలి పాండు, మోతీలాల్, చెన్నకేశవులు, లక్ష్మయ్య, కృష్ణయ్య, శివరాజ్, రవి, గణేష్,నరేందర్, ధనుష్,కుమార్, తదితరులు పాల్గొన్నారు..

# నూతనంగా బాధ్యతలు చేపట్టినడీఎఫ్‌వో

**భద్రాద్రి కొత్తగూడెం, మహా** :నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్(డీఎఫ్‌వో) సిద్ధార్థ విక్రమ్ సింగ్‌ను ఇల్లందు గెస్ట్ హౌస్‌లో శనివారం సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతల్లో డీఎఫ్‌ఓ విజయవంతంగా రాణించాలని జీఎం షాలేం రాజు ఆకాంక్షించారు. అటవీ సంరక్షణ పర్యావరణ పరిరక్షణ హరితాభివృద్ధి కార్యక్రమాల అమలులో అటవీ శాఖ విశేష సేవలు అందించాలని కోరారు. అలాగే సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ చేపడుతున్న హరితహారం మొక్కల పెంపకం గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను వివరించారు. అటవీ శాఖ-సింగరేణి సంస్థల మధ్య పరస్పర సహకారంతో పర్యావరణ పరిరక్షణ హరితాభివృద్ధి గనుల పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు కృషి చేయాలని ఇరువురు అభిప్రాయపడ్డారు.

# యూజ్డ్ కార్ల వ్యాపారం పేరుతో భారీ మోసం

- **కార్స్24 సంస్థతో సంబంధం ఉందని నమ్మించి పెట్టుబడులు సేకరణ**
- **వాజిద్ ఖాన్, అతని భార్యపై సీసీఎస్ లో కేసు నమోదు**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ లో భారీ పెట్టుబడి మోసం వెలుగుచూసింది. సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారంలో అధిక లాభాలు చేకూరుస్తామని నమ్మించి, ఓ దంపతులు పలువురి నుంచి సుమారు రూ.1.58 కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారు. కార్స్24 ప్రతినిధులుగా చలామణి అవుతూ ఈ ఘరానా మోసానికి తెరలేపిన నిందితులపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుల్లో ఒకరైన రయీస్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ ఉదంతం బయటపడింది. నిందితుడైన వాజిద్ అహ్మద్ ఖాన్ తనకు వ్యక్తిగతంగా పరిచయమని, గత నవంబర్‌లో తనను సంప్రదించాడని రయీస్ తెలిపారు. కార్స్24 సంస్థ ద్వారా పాత కార్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని అధిక లాభాలకు విక్రయించవచ్చని, అయితే తన వద్ద సరిపడా పెట్టుబడి లేదని వాజిద్ నమ్మబలికాడు. పెట్టుబడికి పూర్తి భద్రతతో పాటు ఆకర్షణీయమైన లాభాలు వస్తాయని వాజిద్ ఇచ్చిన హామీని నమ్మిన రయీస్, సుమారు రూ.58 లక్షలు పెట్టుబడిగా పెట్టారు. ఈ మొత్తాన్ని వాజిద్‌తో పాటు అతని భార్యకు చెందిన బ్యాంకు ఖాతాలకు వివిధ విడతల్లో బదిలీ చేసినట్లు రయీస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రయీస్‌తో పాటు అతని స్నేహితులు, ఇతర పరిచయస్తుల నుంచి కూడా నిందితులు ఇదే పద్ధతిలో భారీగా పెట్టుబడులు సేకరించారు. బాధితులందరి నుంచి వసూలు చేసిన మొత్తం రూ.1.58 కోట్లు దాటినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



# తక్కువ ధరకే విద్యుత్ వాహనాలు

భారత మార్కెట్లోల కొనుగోలును మరింత అందుబాటులోకి తీసుకురావడానికి హ్యుందాయ్ కీలక నిర్ణయం తీసుకుంది. తన క్రెటా ఎలక్ట్రిక్ కోసం బ్యాటరీసేవ పథకంను ప్రవేశపెట్టింది. ఈ విధానంలో బ్యాటరీ ధరను వాహనం ధర నుంచి వేరు చేయడంతో వినియోగదారులు తక్కువ ప్రారంభ పెట్టుబడితోనే ఈ ఎస్‌యూవీని సొంతం చేసుకునే అవకాశం కల్పించింది.

ఈ కొత్త పథకం కింద క్రెటా ఎలక్ట్రిక్ ప్రారంభ ధర రూ.10.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్) గా నిర్ణయించారు. సాధారణంగా ఈ వాహనం ధర రూ.18.03 లక్షల నుంచి రూ.24.70 లక్షల వరకు ఉండగా, కొత్త విధానంతో ప్రారంభ ధరలో దాదాపు రూ.7 లక్షల వరకు తగ్గుదల వచ్చింది. దీంతో ఒకేసారి భారీ మొత్తం చెల్లించలేని వినియోగదారులకు ఇది ఆకర్షణీయమైన అవకాశంగా మారనుంది.

**బ్యాటరీ-సేవ పథకం ఎలా పనిచేస్తుంది?**

ఈ విధానంలో వినియోగదారు బ్యాటరీని పూర్తిగా కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. బ్యాటరీని చందా విధానంలో వినియోగించుకోవచ్చు. ఇందుకోసం ప్రతి కిలోమీటర్‌కు రూ.3.90 చెల్లించాలి. అంటే నెలవారీ స్థిర వాయిదా కాకుండా, వాహనం ఎంత నడిపితే అంత మేరకు మాత్రమే బ్యాటరీ వినియోగ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

అన్ని వేరియంట్లకు సంబంధించిన పూర్తి వివరాలను హ్యుందాయ్ ఇంకా వెల్లడించలేదు. అయితే తక్కువ ప్రారంభ ధరతో మరింత మంది వినియోగదారులను విద్యుత్ వాహనాల వైపు ఆకర్షించడమే కంపెనీ లక్ష్యంగా కనిపిస్తోంది.

**ఈ సేవ అందిస్తున్న ఏడో సంస్థ**

భారతదేశంలో బ్యాటరీసేవ విధానాన్ని తొలిసారిగా



ఎంజీ మోటార్ తన విండ్సర్ విద్యుత్ వాహనంతో ప్రారంభించింది. ఆ తర్వాత సిట్రోయెన్, కియా, మారుతి సుజుకి, టొయోటా తదితర సంస్థలు కూడా ఇదే విధానాన్ని అమలు చేశాయి. ఇప్పుడు హ్యుందాయ్ కూడా ఈ జాబితాలో చేరి ఈ సేవలను అందిస్తున్న ఏడో వాహన తయారీ సంస్థగా నిలిచింది. మరోవైపు మహీంద్రా, విన్‌ఫాస్ట్ సంస్థలు ఇప్పటివరకు ఈ సేవను ప్రారంభించలేదు.

**రెండు బ్యాటరీ ఎంపికలు**

క్రెటా ఎలక్ట్రిక్ రెండు బ్యాటరీ ఎంపికలతో అందుబాటులో ఉంది.42 కిలోవాట్ గంటల బ్యాటరీ - ఒక్కసారి పూర్తిగా చార్జ్ చేస్తే 420 కిలోమీటర్ల వరకు ప్రయాణం.51.4 కిలోవాట్ గంటల బ్యాటరీ - ఒక్కసారి పూర్తిగా చార్జ్ చేస్తే 510 కిలోమీటర్ల వరకు ప్రయాణం.రెండు వేరియంట్లలోనూ ముందు చక్రాలకు శక్తిని అందించే వ్యవస్థ ఉంటుంది. పెద్ద బ్యాటరీ కలిగిన వేరియంట్ 171 హార్స్‌పవర్ శక్తిని ఉత్పత్తి చేస్తే, సాధారణ బ్యాటరీ వేరియంట్ 135 హార్స్‌పవర్ శక్తిని అందిస్తుంది.

**కొత్త సౌకర్యాలు**

ఈ కొత్త పథకంతో పాటు క్రెటా ఎలక్ట్రిక్‌లో మరికొన్ని సౌకర్యాలను కూడా హ్యుందాయ్ అందిస్తోంది. ప్రయాణికులు సులభంగా ఎక్కి దిగేందుకు కొత్త సైడ్ స్టెప్పు ఏర్పాటు చేసింది. అలాగే ఎంపిక చేసిన వేరియంట్లలో 7.4 కిలోవాట్ గృహ విద్యుత్ ఛార్జర్ను ప్రామాణికంగా అందిస్తోంది. గతంలో 11 కిలోవాట్ ఛార్జర్ మాత్రమే అందుబాటులో ఉండేది. ఇంట్లోనే ఛార్జింగ్ సదుపాయం ఏర్పాటు చేసుకోవాలనుకునే వినియోగదారులకు ఇది మరింత ఉపయోగకరంగా ఉండనుంది.

## తగ్గిన విదేశీ మారక నిల్వలు

భారత విదేశీ మారక నిల్వలు, బంగారు నిల్వలు గణనీయంగా తగ్గినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వెల్లడించింది. జూన్ 26తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలు 5.654 బిలియన్ డాలర్లు తగ్గి 666.933 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతకుముందు వారంలో ఇవి 672.587 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం, విదేశీ మారక నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 150 మిలియన్ డాలర్లు తగ్గి 541.067 బిలియన్ డాలర్లకు చేరాయి. అమెరికేతర కరెన్సీలైన యూరో, పౌండ్, యెన్‌ల మారకపు విలువల్లో వచ్చిన హెచ్చుతగ్గులు కూడా ఈ తగ్గుదలకు కారణమయ్యాయి.

ఇక బంగారు నిల్వలు ఒకే వారంలో 5.394 బిలియన్ డాలర్లు తగ్గి 102.536 బిలియన్ డాలర్లకు చేరాయి. అదే సమయంలో ప్రత్యేక డ్రాయింగ్ హక్కుల విలువ 89 మిలియన్ డాలర్లు తగ్గి 18.558 బిలియన్ డాలర్లకు చేరగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి వద్ద భారత రిజర్వ్ స్థానం 21 మిలియన్ డాలర్లు తగ్గి 4.777 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

గత ఫిబ్రవరి చివరి వారంలో భారత విదేశీ మారక నిల్వలు 728.494 బిలియన్ డాలర్లతో రికార్డు స్థాయిని నమోదు చేశాయి. అయితే అనంతరం పశ్చిమ ఆసియాలో పెరిగిన భౌగోళిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. రూపాయి విలువను స్థిరీకరించేందుకు ఆర్‌బీఐ మార్కెట్‌లో డాలర్లను విక్రయించడంతో విదేశీ మారక నిల్వలు తగ్గినట్లు ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ఉల్లి రైతులకు కేంద్రం గుడ్‌న్యూస్

మార్కెట్‌లో ఉల్లి ధరలు అదుపులో ఉండేలా చూడడంతో పాటు రైతులకు మెరుగైన ధర అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అత్యవసర నిల్వల కోసం కొనుగోలు చేసే ఉల్లి ధరను 13 శాతం పెంచింది. దీంతో కనీస కొనుగోలు ధర క్వింటాల్‌కు రూ.1,875 నుంచి రూ.2,125కు పెరిగింది. ఈ కొత్త ధరలు జూలై 4 నుంచి అమల్లోకి వచ్చాయి.ప్రస్తుత మార్కెటింగ్ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం ఉల్లి కొనుగోలు ధరను పెంచడం ఇది ఐదోసారి. ధరల స్థిరీకరణ నిధి కింద 2026 బఫర్ స్టాక్ కోసం ఉల్లి సేకరణ ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. జూన్ 1 నుంచి ఇప్పటివరకు కేవలం 2,000 టన్నుల ఉల్లినే కొనుగోలు చేసింది. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 202526లో దేశంలో ఉల్లి ఉత్పత్తి 307.37 లక్షల టన్నులకు చేరే అవకాశం ఉంది. ఇది గత ఏడాది ఉత్పత్తితో దాదాపు సమానమే. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో తగినంత నిల్వలు ఉండటంతో ప్రస్తుతం కొరత వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దేశవ్యాప్తంగా రోజుకు 50 వేల టన్నులకుపైగా ఉల్లి మార్కెట్‌కు వస్తుండగా, అందులో మహారాష్ట్ర నుంచే సుమారు 30 వేల టన్నులు సరఫరా అవుతున్నాయి. అక్కడ కిలో ఉల్లి సగటు ధర రూ.18 కాగా, దేశవ్యాప్తంగా సగటు చిల్లర ధర రూ.31గా ఉంది.

అయితే రుతుపవనాల ఆలస్యం, కొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం కారణంగా వ్యాపారులు ముందస్తుగా ఉల్లి కొనుగోళ్లు పెంచుతున్నారు. మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతంలో ఖరీఫ్ ఉల్లి సాగు కూడా సుమారు 15 రోజులు ఆలస్యమైంది.ఎగుమతుల విషయానికి వస్తే జూన్‌లో సుమారు 1.50 లక్షల టన్నుల ఉల్లి విదేశాలకు వెళ్లింది. అయితే గల్ఫ్ దేశాలు, శ్రీలంక వంటి మార్కెట్లలో పాకిస్తాన్, చైనా ఉల్లి తక్కువ ధరకు లభిస్తుండటంతో రానున్న రోజుల్లో భారత ఉల్లి ఎగుమతులు తగ్గే అవకాశం ఉందని అంచనా. అయినప్పటికీ కేంద్రం పెంచిన కొనుగోలు ధరతో దేశంలోని ఉల్లి రైతులకు ఆర్థికంగా ఊరట లభించనుంది.



# దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



## బెంగాల్ టీఎంసీ అధ్యక్ష పదవికి చంద్రిమ భట్టాచార్య రాజీనామా

- **పార్టీలోని అన్ని పదవుల నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటన**
- **అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత టీఎంసీలో ముదిరిన సంక్షోభం**
- **రాజీనామా అనంతరం తిరుగుబాటు నేతలతో భేటీ**

**కోల్ కత్తా, మహా :** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలో రాజకీయ సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితురాలిగా గుర్తింపు పొందిన సీనియర్ నాయకురాలు, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రిమ భట్టాచార్య తన పదవులన్నింటికీ రాజీనామా చేశారు. శనివారం ఆమె ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కేవలం రాష్ట్ర అధ్యక్ష పదవికే కాకుండా, పార్టీ బ్యాంకు ఖాతాల ఆథరైజ్డ్ సిగ్నేచరీగా, ఎన్నికల సంఘం వద్ద పార్టీ ప్రతినిధిగా కూడా తన బాధ్యతల నుంచి ఆమె తప్పుకున్నారు. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘోర పరాజయాన్ని చవిచూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జూన్ ఆరంభంలో మమతా బెనర్జీ పాత కమిటీలను రద్దు చేసి, చంద్రిమను రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించారు. అయితే, బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే ఆమె రాజీనామా చేయడం పార్టీ వర్గాల్లో కలకలం సృష్టించింది. తన రాజీనామా లేఖలో మమతా బెనర్జీ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని చంద్రిమ పేర్కొన్నారు.

ప్రస్తుతం టీఎంసీలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరాయి. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులైన రిత్రబ్రత బెనర్జీ వర్గంతో మెజారిటీ ఎమ్మెల్యేలు చేతులు కలిపారు. తన రాజీనామాను సమర్పించిన వెంటనే చంద్రిమ భట్టాచార్య అసెంబ్లీలో రెబల్ నేతలతో సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే పార్టీకి చెందిన 28 మంది లోక్‌సభ ఎంపీలలో సుమారు 20 మంది ఎన్డీఏకు మద్దతిస్తున్న మరో పార్టీలో విలీనమయ్యారు. చంద్రిమ రాజీనామాపై మమత బెనర్జీ వర్గం నేతలు స్పందించారు. పార్టీలో కీలక పదవులను అనుభవించి, ఇప్పుడు ఇలా వ్యవహరించడం సరైనది కాదని ఎమ్మెల్యే కునాల్ ఘోష్ అభిప్రాయపడ్డారు. టీఎంసీ క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోతోందనడానికి ఇదే నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య వ్యాఖ్యానించారు

# రాజస్థాన్ శిల్పకళతో జోధ్‌పూర్‌కు నూతన టెర్మినల్

రాజస్థాన్‌లో విమానయాన రంగానికి మరింత ఊతమిస్తూ జోధ్‌పూర్ విమానాశ్రయంలో నిర్మించిన అత్యాధునిక టెర్మినల్ భవనాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. రూ.480 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ టెర్మినల్ సుమారు 23 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూపుదిద్దుకోగా, సంవత్సరానికి 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ భవనాన్ని నిర్మించారు.

ఈ టెర్మినల్ ప్రత్యేకత రాజస్థాన్ సంప్రదాయ శిల్పకళను ఆధునిక నిర్మాణ శైలితో మేళవించడమే. రాజస్థాన్ రాజరిక వారసత్వాన్ని ప్రతిబింబించే తోరణాలు, ఝరోఖాలు, స్థానిక కళా నమూనాలతో భవనాన్ని అలంకరించారు. దీంతో ఇది కేవలం విమానాశ్రయ టెర్మినల్ మాత్రమే కాకుండా రాష్ట్ర సంస్కృతి, వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. జోధ్‌పూర్‌కు వచ్చే దేశీయ, విదేశీ పర్యాటకులకు రాష్ట్ర కళా వైభవాన్ని మొదటి చూపులోనే పరిచయం చేసేలా రూపకల్పన చేశారు.ప్రయాణికుల సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ వేగవంతమైన చెక్‌ఇన్ కౌంటర్లు, విశాలమైన వేచివుండే లాంజ్‌లు, ఆధునిక భద్రతా వ్యవస్థలు, డిజిటల్ సమాచార కేంద్రాలు, మెరుగైన సామానుల నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారులతో ప్రయాణించే కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సౌకర్యాలు కూడా కల్పించారు.



పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా ఈ టెర్మినల్‌ను నిర్మించారు. శక్తి పొదుపు పరికరాలు, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ, సహజ కాంతి వినియోగం, పర్యావరణహిత నిర్మాణ సామగ్రి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఐదు నక్షత్రాల గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలు సాధించే లక్ష్యంతో రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జోధ్‌పూర్ వంటి చారిత్రక నగరాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. మెరుగైన విమాన అనుసంధానం వల్ల పెట్టుబడులు, వాణిజ్యం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుందని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రాంతీయ విమాన అనుసంధానానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, సామాన్య ప్రజలకు కూడా విమాన ప్రయాణం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో అనేక ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న పదేళ్లలో రూ.28,840 కోట్లతో విమానయాన రంగాన్ని మరింత విస్తరించే ప్రణాళిక అమలులో ఉందని చెప్పారు.కొత్త టెర్మినల్ ప్రారంభంతో జోధ్‌పూర్ విమానాశ్రయం ప్రయాణికుల రద్దీని మరింత సమర్థంగా నిర్వహించడంతో పాటు రాజస్థాన్‌లో పర్యాటకం, వాణిజ్యం, పారిశ్రామిక అభివృద్ధికి కీలక కేంద్రంగా మారనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇది రాష్ట్రానికి మాత్రమే కాకుండా దేశ పౌర విమానయాన రంగ అభివృద్ధిలో కూడా మరో ముఖ్యమైన ముందడుగుగా నిలవనుంది.

## బాలుడిపై అమానుష దాడి.. నిందితుడు అదుపులోకి

ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. దిదౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని నార్తో గ్రామంలో తల్లి పక్కన నిద్రిస్తున్న ఓ బాలుడిని గుర్తుతెలియని వ్యక్తి అపహరించి, గ్రామ సమీపంలోని అడవిలో తీవ్రంగా గాయపరిచిన ఘటన కలకలం రేపింది. బాలుడిని రక్తస్రావంతో అపస్మారక స్థితిలో గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడు. వైద్యుల ప్రకారం బాలుడి పరిస్థితి విషమంగా ఉంది.పోలీసుల వివరాల ప్రకారం, శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది. తల్లి పక్కన నిద్రిస్తున్న కమల్‌జీత్ అనే బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామమంతా గాలించారు. అనంతరం గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో తీవ్ర గాయాలతో అతడు కనిపించాడు. బాధితుడికి పదునైన ఆయుధంతో దాడి జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. గాయాల స్వరూపంపై వైద్య పరీక్షల నివేదిక కోసం ఎదురుచూస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసులో ప్రధాన నిందితుడిగా సంభాల్ జిల్లాకు చెందిన షాన్‌ను పోలీసులు గుర్తించారు. అతడు మాదకద్రవ్యాలకు బానిసైనట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. నిందితుడు, బాధిత కుటుంబం మధ్య గతంలో వివాదాలు ఉన్నట్లు కూడా విచారణలో వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. గతంలో నమోదైన కేసుల కోణంలోనూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## పాక్ కోస్ట్ గార్డ్ శిబిరంపై భారీ దాడి

పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో గ్వాదర్ జిల్లా జీవాని ప్రాంతంలో ఉన్న కోస్ట్ గార్డ్ శిబిరంపై శుక్రవారం సాయంత్రం ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడికి నిషేధిత ఉగ్రవాద సంస్థ బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) బాధ్యత వహిస్తూ, 30 మందికిపైగా పాకిస్థాన్ భద్రతా సిబ్బంది మరణించారని ప్రకటించింది. అయితే ఈ సంఖ్యను పాకిస్థాన్ ప్రభుత్వం లేదా సైన్యం ఇప్పటివరకు అధికారికంగా ధృవీకరించలేదు.బలోచిస్థాన్ పోస్ట్ కథనం ప్రకారం, స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 6:32 గంటలకు బీఎల్ఏకు చెందిన మజీద్ బ్రిగేడ్ ఈ దాడిని నిర్వహించింది. పేలుడు పదార్థాలతో నిండిన ట్రక్కును కోస్ట్ గార్డ్ శిబిరంలోకి ఢీకొట్టడంతో భారీ పేలుడు సంభవించింది. అనంతరం బీఎల్ఏకు చెందిన సాయుధ సభ్యులు శిబిరంపై కాల్పులు జరిపినట్లు సంస్థ ప్రకటించింది.ఈ దాడిలో శిబిరానికి తీవ్ర నష్టం జరిగిందని, పలువురు భద్రతా సిబ్బంది మరణించి, మరికొందరు శిథిలాల కింద చిక్కుకుపోయారని బీఎల్ఏ పేర్కొంది. అయితే ఈ వివరాలపై స్వతంత్ర ధృవీకరణ లేదు.బలోచిస్థాన్‌కు స్వాతంత్ర్యం సాధించే వరకు తమ సాయుధ పోరాటం కొనసాగుతుందని బీఎల్ఏ హెచ్చరించింది. మరోవైపు ఈ ఘటనపై పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యం ఇప్పటివరకు అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. దీంతో ప్రాణనష్టం, నష్టం వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది.



## వివేకానంద స్ఫూర్తితో ప్రజాసేవ చేయాలి

ప్రజాప్రతినిధులు స్వామి వివేకానంద ఆదర్శాలను ఆచరణలో పెట్టి ప్రజాసేవలో విలువలు, నైతికతకు ప్రాధాన్యం ఇవ్వాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్ 18వ శాసనసభకు ఎన్నికైన సభ్యుల కోసం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జీవిత సందేశాన్ని గుర్తు చేసిన ఓం బిర్లా, వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని, సామాజిక, ఆధ్యాత్మిక, రాజకీయ నాయకత్వంలో కొత్త దిశను చూపిస్తుందని అన్నారు. ఒక వ్యక్తి భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆలోచనలు, సేవలు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.స్వామి వివేకానంద బోధనలు యువతలో సేవాభావం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ప్రేరణగా నిలుస్తాయని ఆయన చెప్పారు. ప్రజాప్రతినిధులు కూడా ఆ విలువలను అనుసరిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో రాజ్యాంగ విలువలు, శాసనసభ కార్యకలాపాలు, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై సభ్యులకు అవగాహన కల్పించారు.



# హీరో ఆఫర్‌కు జగపతి బాబు నో..!

తెలుగు సినీ పరిశ్రమలో హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన జగపతి బాబు, కాలానికి తగ్గట్టుగా తనను తాను మార్చుకుంటూ విజయవంతమైన రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నారు. ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. 'గాయం', 'మావిచిగురు', 'అల్లరి ప్రేమికుడు', 'హనుమాన్ జంక్షన్' వంటి చిత్రాల్లో ఆయన నటన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. కుటుంబ కథా చిత్రాలు, యాక్షన్, ఎమోషనల్ డ్రామాలు.. ఇలా ప్రతి జానర్‌లోనూ తనదైన ముద్ర వేసి స్టార్ హీరోగా ఎదిగారు.

అయితే కాలం మారడంతో హీరోగా అవకాశాలు తగ్గిన సమయంలో నిరాశ చెందకుండా కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. తనలోని నటుడిని మరో కోణంలో ఆవిష్కరిస్తూ ప్రతినాయకుడిగా కొత్త ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా నందమూరి బాలకృష్ణ నటించిన 'లెజెండ్' చిత్రంలో పవర్‌ఫుల్ విలన్‌గా కనిపించిన జగపతి బాబు కెరీర్‌కు అది కీలక మలుపుగా మారింది. ఆ చిత్రం తర్వాత టాలీవుడ్ మాత్రమే కాకుండా తమిళం, కన్నడ, హిందీ చిత్ర పరిశ్రమల నుంచీ వరుస అవకాశాలు ఆయనను వరించాయి.

ప్రస్తుతం స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రలు, శక్తివంతమైన ప్రతినాయక పాత్రలకు ఆయన మొదటి ఎంపికగా నిలుస్తున్నారు.

ఇలాంటి సమయంలో ఓ ప్రముఖ దర్శకనిర్మాత జగపతి బాబును మరోసారి సోలో హీరోగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రత్యేక కథను సిద్ధం చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆ కథను స్వయంగా ఆయనకు వినిపించి హీరోగా నటించాలని కోరినప్పటికీ, జగపతి బాబు ఆ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం.

ప్రస్తుతం విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రేక్షకుల్లో ఏర్పడిన ఇమేజ్, వరుస అవకాశాలు, పరిశ్రమలో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని మళ్లీ హీరోగా ప్రయోగాలు చేయడం సరైన నిర్ణయం కాదని ఆయన భావించినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఆ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోకపోతే ఎంతో కష్టపడి సంపాదించుకున్న ప్రస్తుత ఇమేజ్‌పై ప్రభావం పడే అవకాశం ఉందనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. కెరీర్ విషయంలో భావోద్వేగాల కంటే దీర్ఘకాలిక ప్రణాళికకే ప్రాధాన్యం ఇస్తున్న జగపతి బాబు నిర్ణయం ఇప్పుడు టాలీవుడ్‌లో ఆసక్తికర చర్చకు దారి తీసింది.

# తిరుపతిలో 'లెనిన్' ప్రీ రిలీజ్ వేడుక

**హైదరాబాద్, మహా:** అక్కినేని అఖిల్ హీరోగా, భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లెనిన్' విడుదలకు సిద్ధమైంది. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ కెరీర్‌లో అత్యంత కీలక చిత్రంగా భావిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసింది.

ఇప్పటికే విడుదలైన 'లెనిన్' ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. యాక్షన్ సన్నివేశాలు, భావోద్వేగాలు, నాగార్జున అందించిన వాయిస్ ఓవర్ ట్రైలర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి.

తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సంబంధించిన వివరాలను మేకర్స్ ప్రకటించారు. జూలై 5న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్‌లో ఈ వేడుకను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయి.

అయితే ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఎవరు హాజరవుతారనే విషయాన్ని మాత్రం చిత్రబృందం ఇంకా రహస్యంగానే ఉంచింది. టాలీవుడ్‌కు చెందిన స్టార్ హీరో లేదా ప్రముఖ దర్శకుడు ముఖ్య అతిథిగా వస్తారా? లేక చిత్ర యూనిట్ సభ్యుల సమక్షంలోనే కార్యక్రమం నిర్వహిస్తారా? అనే అంశంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.ఈ చిత్రానికి ఎస్.ఎస్. తమన్ సంగీతం అందించగా, అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, ట్రైలర్ సినిమాపై మంచి బజ్‌ను సృష్టించగా, ప్రీ రిలీజ్ ఈవెంట్‌తో ఆ హైప్‌ను మరింత పెంచాలని చిత్ర బృందం భావిస్తోంది. 'ఏజెంట్' తర్వాత అఖిల్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేసిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో అన్న ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది.



# ట్రెడిషనల్ లుక్‌లో అనసూయ

హైదరాబాద్, మహా : ప్రముఖ నటి అనసూయ భరద్వాజ్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. నారింజ రంగు చీరకు ఊదా రంగు బ్లౌజ్‌ను జత చేసి సంప్రదాయం, ఆధునికత కలబోసిన ప్రత్యేక రూపంలో కనిపించారు. ఈ ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకుంటూ "కొంచెం సంప్రదాయం.. కొంచెం తిరుగుబాటు.. అదే నేను" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఈ లుక్‌కు స్టైలిస్ట్ రిషి చౌదరి కాగా, చీరను కసం ఫ్యాషన్స్, బ్లౌజ్‌ను లిటిల్ సన్‌షైన్ ది లేబుల్, ఆభరణాలను ట్రెజర్ బాక్స్ ఒరిజినల్స్ అందించాయి.

టెలివిజన్ వ్యాఖ్యాతగా 'జబర్దస్త్' కార్యక్రమంతో గుర్తింపు తెచ్చుకున్న అనసూయ, 2016లో సోగ్గాడే చిన్నినాయనా చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేశారు. అదే ఏడాది విడుదలైన క్షణం చిత్రంలో నటనకు ప్రశంసలు అందుకున్నారు. అనంతరం రంగస్థలం, పుష్ప: ది రైజ్ వంటి విజయవంతమైన చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి నటిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించారు.

ప్రస్తుతం హరి హర వీరమల్లు, అరి: మై నేమ్ ఈజ్ నోబడీతో పాటు పలు తెలుగు చిత్రాల్లో నటిస్తున్నారు. వైవిధ్యమైన పాత్రలు, ఆకట్టుకునే నటన, ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌లతో అనసూయ దక్షిణాది సినీ పరిశ్రమలో తన ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నారు.



# సమంత జీవితంలో కొత్త అధ్యాయం..!



**హైదరాబాద్, మహా:** దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న పాన్ ఇండియా నటి సమంత రూత్ ప్రభు మరోసారి వార్తల్లో నిలిచారు. కెరీర్‌లో వరుస విజయాలతో పాటు వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్న ఆమె ప్రస్తుతం జీవితాన్ని కొత్త కోణంలో చూస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రముఖ దర్శకురాలు నందిని రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు సమంత వ్యక్తిగత జీవితం గురించి మరోసారి చర్చకు దారి తీశాయి. 15 ఏళ్ల సినీ ప్రయాణం అనంతరం సమంత ఇప్పుడు జీవితంలో పూర్తి సంతృప్తిగా ఉన్నారని ఆమె పేర్కొనడం అభిమానుల్లో ఆసక్తిని పెంచింది.

మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన సమంత, 'ఏ మాయ చేసావే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమై అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. తెలుగు, తమిళ భాషల్లో వరుస విజయాలను అందుకుంటూ అగ్ర కథానాయికల జాబితాలో స్థానం సంపాదించారు. తన సహజమైన నటన, అందం, పాత్రలకు తగ్గ అభినయంతో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు.

అయితే కెరీర్ శిఖరాగ్రంలో ఉన్న సమయంలోనే నాగచైతన్యతో ప్రేమ, వివాహం, అనంతరం విడాకులు ఆమె జీవితంలో పెద్ద మలుపుగా మారాయి. ఆ తర్వాత మయోసైటిస్ అనే అరుదైన వ్యాధి బారిన పడటంతో కొంతకాలం సినిమాలకు దూరమయ్యారు. చికిత్స తీసుకుంటూనే ధైర్యంగా పోరాడిన సమంత, శారీరకంగా, మానసికంగా తిరిగి కోలుకుని మళ్లీ కెమెరా ముందుకు రావడం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచింది.

ఒకప్పుడు ప్రేమ కథలు, కుటుంబ కథా చిత్రాలు, వినోదాత్మక పాత్రలతో ప్రేక్షకులను అలరించిన సమంత, ఇప్పుడు యాక్షన్ ప్రధాన చిత్రాల్లోనూ తన సత్తా చాటుతున్నారు. డూప్‌ల సహాయం లేకుండానే క్లిష్టమైన యాక్షన్ సన్నివేశాల్లో నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. స్టార్ హీరోలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో యాక్షన్ సన్నివేశాల్లో కనిపిస్తూ తన నటనా వైవిధ్యాన్ని మరోసారి నిరూపిస్తున్నారు.

ప్రస్తుతం సమంత నటిస్తున్న పలు ప్రాజెక్టులపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. వెబ్ సిరీస్‌లు, పాన్ ఇండియా సినిమాలతో పాటు నిర్మాతగా కూడా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. విభిన్నమైన కథలను ఎంపిక చేసుకుంటూ కెరీర్‌లో కొత్త దిశగా అడుగులు వేస్తున్నారు.

ఇదిలా ఉండగా, సమంత వ్యక్తిగత జీవితంపై మరోసారి సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరాతో ఆమె సన్నిహితంగా ఉన్నారనే వార్తలతో పాటు ఇద్దరూ వివాహం చేసుకున్నారని, సమంత త్వరలో తల్లి కాబోతున్నారనే ప్రచారం కూడా వైరల్ అవుతోంది. అయితే ఈ వార్తలపై సమంత గానీ, ఆమె ప్రతినిధులు గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందనే విషయంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com